RNI Reg-No. APTEL/2002/07373

Postal Registration No.VJ/215/2025-27

# నేటి మనదేశమ్

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Vijayawada, Visakhapatnam, Tirupati & Hyderabad

సంపుటి :24 Vol. No.24 సంచిక : 53 Issue No. 53 విజయవాడ Vijayawada సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: శుక్రవారం 20-02-2026 Friday, February 20 2026 పేజీలు : 8 Pages: 8 వెల: రూ.1-00 Price Rs.1-00

## హెరిటేజ్ చీజ్ ప్యాకెట్ చూపించి వైకాపా పరువు పోగొట్టుకుంది

**తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు**



**తిరుమల, ఫిబ్రవరి 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కల్తీ నెయ్యి కేసులో పీకల్లోతు కూరుకుపోయిన వైకాపా నేతలు.. హెరిటేజ్‌పై ఆరోపణలు చేయడం దుర్మార్గమని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సంస్థ ఎప్పుడూ

మిగతా 2లో..

## మన ఆలోచనలకు అందనంతగా ఏఐ

**మానవ అభివృద్ధిలో ఏఐది కీలక భూమిక... భారత్‌లో ఏఐ పురోభివృద్ధి చరిత్రగా నిలుస్తుంది**

**ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు లో ప్రధాని మోడీ**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ఆర్ఎన్ఎ):** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యం మన ఆలోచనలకు అందనంత దూరంలో ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఏఐ వినియోగం చట్టబద్ధంగా, పునఃసమీక్షించేలా ఉండాలని చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు' లో గురువారం ప్రధాని ప్రసంగించారు. మానవ అభివృద్ధిలో ఏఐ కీలక భూమిక పోషిస్తోందని ప్రధాని తెలిపారు. మేకిన్ ఇండియా, భారత ఆవిష్కరణ సామర్థ్యాన్ని ఈ సదస్సు చాటుతోందని పేర్కొన్నారు. ప్రపంచంలో ఆరోవంతు జనాభా భారత్‌లోనే ఉందని, కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటోందని చెప్పారు. కృత్రిమ మేధను ఉపయోగించుకోవడంలో దేశ యువత ఆసక్తి కనబరుస్తోందని తెలిపారు. భారత్‌లో ఏఐ పురోభివృద్ధి ఒక చరిత్రగా నిలుస్తుందన్నారు. కృత్రిమ మేధకు పరివర్తన శక్తి ఉందని ప్రధాని చెప్పారు. దాన్ని దుర్వినియోగం చేస్తే విధ్వంసానికి దారితీస్తుందని, అదే సద్వినియోగం చేసుకుంటే పరిష్కారాలు చూపుతుందని అన్నారు. మనుషులు, సాంకేతికత కలిసి అభివృద్ధి పయనం సాగించే శకంలో మనం ఉన్నామని తెలిపారు. భవిష్యత్తులో ఏఐ ఏం చేయగలదో కాదు.. ప్రస్తుతం కృత్రిమ మేధను ఉపయోగించి మనం ఏం చేయగలమనేదే అసలు ప్రశ్న అని అన్నారు. ప్రజా సంక్షేమం, శ్రేయస్సే ఏఐకి మన

మిగతా 2లో..



# అధిక వడ్డీ రుణాలపై వడ్డీ తగ్గింపు

- ఏటా 2వేల కోట్లు ఆదా అయ్యేలా చర్యలు
- మైనింగ్ శాఖలో 33 శాతం ఆదాయం మెరుగు
- ఎక్సైజ్ శాఖలో 24 శాతం ఆదాయం పెరుగుదల
- వైసీపీ నెవర్ ఎగైన్.. కూటమి వన్స్ ఎగైన్'
- అసెంబ్లీలో బడ్జెట్ సమాధానంలో మంత్రి పయ్యావుల కేశవ్

**అమరావతి, ఫిబ్రవరి 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అధిక వడ్డీలతో తెచ్చిన రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించేలా సంప్రదింపులు జరుపుతున్నామని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. సుమారు రూ.2 వేల కోట్ల మేర వడ్డీలు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఏడాదికి రూ.2 వేల కోట్లు ఆదా అయితే.. చాలా పథకాలు సమర్థవంతంగా అమలు చేయవచ్చన్నారు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే మైనింగ్ శాఖలో 33 శాతం, ఎక్సైజ్ శాఖలో 24 శాతం ఆదాయం పెరిగిందని వివరించారు. గత ప్రభుత్వంలో గనులు, ఎక్సైజ్ ఆదాయం తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లిందని వైసీపీపై పయ్యావుల విమర్శలు గుప్పించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై

మిగతా 2లో..

## దేవ్‌జీ లక్ష్యంగా కూంబింగ్

**కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్**

**ఐదుగురు మావోల మృతి చెందినట్లు గుర్తింపు**



**రాయపూర్, ఫిబ్రవరి 19 (ఆర్ఎన్ఎ):** ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాల కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. మావోయిస్టు అగ్రనేత, ఆ పార్టీ కార్యదర్శి దేవ్ జీ లక్ష్యంగా కర్రెగుట్టల అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. కర్రెగుట్టల్లో తలదాచుకున్న మావోయిస్టులు.. ఈ విషయాన్ని గమనించి భద్రతా బలగాలపైకి కాల్పులు జరిపారు. వెంటనే భద్రతా బలగాలు సైతం ఎదురుకాల్పులకు దిగాయి. ఇరువైపులా నుంచీ హోరాహోరీగా కాల్పులు జరిగాయి. కొద్దిసేపటి తర్వాత

మిగతా 2లో..

## ఉచిత పథకాలపై మరోమారు సుప్రీం సీరియస్

**ప్రజల సొమ్మును దుబారా చేయడంపై ఆగ్రహం... పేదలకు విద్య, తదితర కనీస అవసరాలు కల్పించాల్సిందే**

**చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ఆర్ఎన్ఎ):** దేశంలో రాజకీయ పార్టీలు అందిస్తున్న ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్రస్థాయిలో స్పందించింది. తమిళనాడు విద్యుత్ పంపిణీ సంస్థకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశ మయ్యాయి. ఉచిత పథకాల వల్ల దేశ ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుందని కోర్టు హెచ్చరించింది. తమిళనాడులో ఉచిత విద్యుత్ సరఫరా, ఆర్థిక స్థితిగతులపై విచారణ చేపట్టిన కోర్టు, విద్యుత్ పంపిణీ సంస్థకు నిధులు ఎక్కడి నుండి వస్తున్నాయో వివరించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. దీనిపై పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని కోరింది. పేదలకు విద్య, కనీస అవసరాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని కోర్టు అంగీకరించింది. అయితే, పెద్ద పెద్ద భూస్వాములకు కూడా ఉచిత విద్యుత్ అందించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. 'సౌకర్యం కావాలనుకున్నప్పుడు డబ్బులు చెల్లించాలి కదా! పెద్ద భూస్వాములు ఉచితం అని అనవసరంగా లైట్లు, మెషీన్లు వాడుతున్నారు' అని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఎన్నికలకు ముందే ఉచిత పథకాలను ప్రకటించే సంస్కృతిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయ పార్టీలు, సామాజికవేత్తలు తమ సిద్ధాంతాలను పునరాలోచించుకోవాల్సిన అవసరం ఉందని హితవు పలికింది. ప్రభుత్వం ఇచ్చే ఉచితాల వెనుక ఉన్నది ప్రజల కష్టార్జితమైన పన్నుల సొమ్ము అని కోర్టు గుర్తు చేసింది. రాష్ట్రాలు అప్పుల్లో ఉన్నప్పటికీ ఉచిత పథకాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది. రాష్ట్రాలు వసూలు చేసే ఆదాయంలో కనీసం 25 శాతాన్ని రాష్ట్ర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ఎందుకు ఉపయోగించకూడదని ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. అంతేకాదు, 'ఉచితాలు ఎన్నాళ్లు కొనసాగుతాయి?' అన్న సుప్రీంకోర్టు ప్రశ్న ఇప్పుడు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సవాలుగా మారింది. సంక్షేమం పేరుతో ఆర్థిక క్రమశిక్షణను విస్మరిస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు తప్పవని అత్యున్నత న్యాయస్థానం పరోక్షంగా హెచ్చరించింది.

## కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయం కోసం రూ.139 కోట్లు

- రూసా కింద రూ.55 కోట్లు ఇప్పటికే ఖర్చు చేశాం
- అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి లోకేశ్



**అమరావతి, ఫిబ్రవరి 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయం కోసం రూ.139 కోట్ల నిధులు మంజూరు చేశామని... దాంట్లో రూసా కింద రూ.55 కోట్లు ఖర్చు చేశామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఏ కార్యక్రమం చేసినా క్లస్టర్ బేస్డ్ అప్రోచ్ తీసుకుంటున్నామని తెలిపారు. ఏపీ అసెంబ్లీ బ్జడెట్ సమావేశాలు ఆరో రోజు ప్రారంభమయ్యాయి. ప్రశ్నోత్తరాలతో సభను మొదలుపెట్టారు స్పీకర్ అయ్యన్నపాత్రుడు. కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయానికి సంబంధించి ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు. కర్నూలు పార్లమెంట్ చుట్టు పక్కల ఎక్కవ పెట్టుబడులు వస్తున్నాయన్నారు. క్లస్టర్ యూనివర్సిటీల్లో ఫోకస్ స్జబెక్టులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. అందుకే స్పెషలైజేషన్‌లపైనా శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. బ్యాలెన్స్ పనులు వచ్చే అకాడమిక్ ఇయర్‌లో పెండింగ్ నిధులు మంజూరు చేస్తామని మంత్రి లోకేశ్ సభలో

మిగతా 2లో..

## ఉప్పాడతీర ప్రాంత అభివృద్ధే లక్ష్యం

- అన్నిశాఖల సమన్వయంతో ప్రణాళికలు
- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**అమరావతి, ఫిబ్రవరి 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకార సోదరుల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా సమగ్ర ప్రణాళికను రూపొందించినట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ఈ ప్రణాళికలకు రూపొందించినట్లు చెప్పారు. 'గతేడాది అక్టోబర్

మిగతా 2లో..

## డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు

❑కొత్త ఆవిష్కరణలు ఆర్థిక వ్యవస్థ వృద్ధికి తోడ్పాటు ❑ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో టెక్ దిగ్గజాల వెల్లడి

❑విశాఖ మీదుగా ఐఐటి ఖరగ్‌పూర్‌కు వెళ్లేవాడిని ❑అదే విశాఖలో ఇప్పుడు గూగుల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం

❑ఏఐ సదస్సులో గూగుల్ సిఇవో సుందర్ పిచాయ్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ఆర్ఎన్ఎ):** డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు సాధిస్తోందని, ఏఐ కేంద్రంగా మారుతోందని పలుదేశాల ప్రతినిధులు ప్రశంసించారు. ప్రపంచంలోనే అతిపెద్ద కృత్రిమ మేధ సదస్సుకు భారత్ వేదికైంది. ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతోన్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్'లో 118 దేశాలు పాల్గొన్నాయి. గురువారం జరిగిన సదస్సు అధికారిక ప్రారంభ కార్యక్రమంలో పలువురు దేశాధినేతలు, టెక్ దిగ్గజాలు పాల్గొని కీలక ప్రసంగం చేశారు. కొత్త ఆవిష్కరణలు ఆర్థిక వ్యవస్థను వృద్ధి పథంలో నడిపిస్తాయి. ఏఐ నిర్మాణం అందరికీ చాలా ఉపయోగంగా ఉంటుంది. భారత్‌ను సందర్శించిన ప్రతిసారీ మార్పుల వేగం చూసి ఆశ్చర్యపోతున్నా. విద్యార్థిగా ఉన్నప్పుడు ఐఐటీ ఖరగ్‌పూర్‌కు విశాఖ మీదుగా వెళ్లేవాడిని. అదే విశాఖ తీరంలో ఇప్పుడు గూగుల్ ఫుల్ స్టాక్ ఏఐ హబ్ ఏర్పాటవుతోంది' అని గూగుల్ సీఈఓ



సుందర్ పిచాయ్ తెలిపారు. డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు సాధిస్తోంది. గతంలో భారత్‌లో బ్యాంకు ఖాతా తెరవాలంటే సమస్యగా ఉండేది. ప్రస్తుతం ఎలాంటి పత్రాలు లేకుండానే బ్యాంకు ఖాతా తెరవగలుగుతున్నారు. ఫోన్‌లోనే బ్యాంకు ఖాతా తెరిచే సౌలభ్యం వచ్చింది. 140 కోట్ల మంది ప్రజలకు భారత్ డిజిటల్ ఐడెంటిటీ తీసుకొచ్చింది. ఆవిష్కరణల పథంలో అందరూ కలిసి ముందుకు సాగాలి. ప్రతినెలా 20 బిలియన్ల డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయి. 500 మిలియన్ల మందికి డిజిటల్ హెల్త్ ఐడీలు ఇచ్చారని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ ప్రశంసించారు. ఏఐ కృత్రిమమైనది కాదు.. వాస్తవమైనదని టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ వ్యాఖ్యానించారు. ఏఐ సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నట్లు

మిగతా 2లో..

## ఆశ్రమం నిర్వహణ చాలా బాగుంది

**కానూరు వృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించిన జస్టిస్ లావు నాగేశ్వరావు**



**విజయవాడ, ఫిబ్రవరి 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పూర్వ జస్టిస్ శ్రీ లావు నాగేశ్వరావు గారు కానూరు వృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించడం జరిగినది. ఆశ్రమంలో ఉన్న

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయిలు

## హెరిటేజ్ చీజ్ ప్యాకెట్ చూపించి వైకాపా పరువు పోగొట్టుకుంది

తితిదేకు నెయ్యి సరఫరా చేయలేదని.. ఇది నిప్పులాంటి నిజమని చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "ప్రత్యక్షంగా, పరోక్షంగా నెయ్యి సరఫరాలో హెరిటేజ్ పాత్ర లేదు. అబద్ధాన్ని పదే పదే చెబితే నిజమవుతుందనుకోవడం మీ భ్రమ. మండలిలో ప్రతిపక్ష నేతగా బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న బొత్స సత్యనారాయణ అన్ని విషయాలు తెలుసుకుని మాట్లాడాలి. హెరిటేజ్ చీజ్ ప్యాకెట్ చూపించి నెయ్యి అని చెప్పి పరువు పోగొట్టుకున్నారు. జగన్ చెప్పినట్లు ఆడకుండా మాట్లాడే ముందు విజ్ఞతతో వ్యవహరించండి. నెయ్యి ధరలపైనా వైకాపా నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. ఓపెన్ టెండర్లలో పారదర్శకంగా వీటిని నిర్ణయించాం. మా పాలకవర్గం రాగానే మొదటగా మేం స్వామి వారి అన్న ప్రసాదాల నాణ్యతలో రాజీపడకూదని నిర్ణయించుకున్నాం. తక్కువ ధరలకు సరకులు కొని స్వామి వారికి నాణ్యత లేని నైవేద్యాలు, భక్తులకు అన్న ప్రసాదాలు అందించడమేంటి? ఈ విషయంలో మేం రాజీపడే ప్రసక్తే లేదు. నెయ్యి ఒక్కటే కాదు అన్ని రకాల పదార్థాల్లోనూ నాణ్యతా ప్రమాణాలు పెంచాం. స్వామివారికి సమర్పించే వాటిలో డబ్బు ఎంత ఖర్చు అవుతుందని లెక్కలు వేసుకోం. ఇదంతా ఆయన సొమ్మే. దేవదేవుని సొమ్ముని నైవేద్యాలకు, అన్న ప్రసాదాలకు వాడే అంశంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడేది లేదు" అని బీఆర్ నాయుడు పేర్కొన్నారు.

## మన ఆలోచనలకు అందనంతగా ఏఐ

బెంచ్‌మార్క్‌లు అని, మానవ కేంద్రీకృత ఏఐ నిర్మాణం మన లక్ష్యం అవ్వాలని ప్రధాని అన్నారు. కృత్రిమ మేధ మనలను శాసించకూడదని, మనమే ఏఐని శాసించాలని మోదీ చెప్పారు. కృత్రిమ మేధ వినియోగంలో 'మానవ్ విజన్' ఉండాలని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ విజన్ అర్థం, ఫ్రేమ్‌వర్క్ అని ఆయన వివరించారు.

## డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు

వెల్లడించారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్యక్రమాలకు భారత్ సాక్షిగా నిలుస్తోంది. 140 కోట్ల మంది ప్రజలతో అతిపెద్ద డిజిటల్ ఐడెంటిటీ వ్యవస్థ కలిగిఉంది. ప్రపంచంలో జరిగే వాటిలో భారత్ నుంచే సగం డిజిటల్ లావాదేవీలు ఉన్నాయి. భారత్‌ను ఏఐ కేంద్రంగా ప్రధాని తీర్చిదిద్దుతున్నారు. సెమీకాన్ ఇండియా, ఇండియా ఏఐ మిషన్‌లో భాగంగా సాంకేతికత అభివృద్ధి జరుగుతోంది. ఏఐ నైపుణ్య శిక్షణలో భారత్ పురోభివృద్ధి సాధిస్తోందన్నారు. గత దశాబ్దకాలంగా ఏఐ వేగంగా ముందుకెళ్తోంది. అతి త్వరలోనే మనుషులు చేసే అత్యంత క్లిష్టమైన పనులను ఏఐ మోడళ్లు సులువుగా పూర్తి చేసే రోజులు రానున్నాయి. ఏఐతో అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయి. ఆ సవాళ్లను పరిష్కరించడంలో భారత్ కీలక పాత్ర పోషించనుందని ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ పేర్కొన్నారు.

## దేవ్‌జీ లక్ష్యంగా కూంబింగ్

మావోయిస్టుల వైపు నుంచి కాల్పులు ఆగిపోయాయి. ఆ ప్రాంతంలో ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు గుర్తించాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భద్రతా బలగాలు వెల్లడించాయి. మృతుల్లో అగ్రనేతలు ఉండవచ్చని భద్రతా దళాలు భావిస్తున్నాయి. మధ్యప్రదేశ్ నుంచి కర్రెగుట్టల్లోకి మావోలు ప్రవేశించారంటూ నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా బలగాలు.. ఈ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టాయి. మరోవైపు దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్ గడువు మరికొన్ని రోజుల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆ లక్ష్యం దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఇప్పటికే వందలాది మంది మావోయిస్టులు మృతిచెందగా.. వేలాది మంది వివిధ రాష్ట్రాల ప్రభుత్వాల ఎదుట లొంగిపోయారు. పలువురు మావోలను ప్రభుత్వం ఇప్పటికే అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం తెలంగాణకు చెందిన 15మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు. ఆ జాబితాలో రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, మావోయిస్టు కీలక నేత ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, పుసునూరి నరహరి అలియాస్ సంతోష్, ముప్పిడి సాంబయ్య, వార్త శేఖర్, జోడే రత్నభాయి, బడే చొక్కారావుల కోసం భద్రతా బలగాలు జల్లెడ పడుతున్నాయి. ఇక ఈ రెండేళ్లలో 588 మంది మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

## ఆశ్రమం నిర్వహణ చాలా బాగుంది




వృద్ధుల యొక్క ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకొన్నారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఆశ్రమం గురించి వివరించి చెప్పడం జరిగినది. శ్రీ లావు నాగేశ్వరావు ఆశ్రమం నిర్వహణ చాలా బాగుంది అని ఆశ్రమ కమిటీ వారికి అభినందనలు తెలియచేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీ జంపాల శరత్ బాబు గారు, శ్రీ లావు నాగేశ్వరరావు గారి జీవిత చరిత్రను వృద్ధులకు వివరించడం జరిగింది. సంస్థ అదనపు కార్యదర్శి శ్రీ వంగర శ్రీనివాస రావు గారు ఆశ్రమం స్థాపన మరియు నిర్వహణ గురించి వివరించడం జరిగినది. ఆశ్రమ ఉపాధ్యక్షులు శ్రీ యార్లగడ్డ సుబ్బారావు గారు శ్రీ లావు నాగేశ్వరరావు గారిని పుష్ప గుచ్ఛం ఇచ్చి దుస్సాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు శ్రీ పొన్నం శ్రీరామ్ గారు, శ్రీ త్రిపురనేని రత్నకుమార్ గారు, శ్రీ గారపాటి సతీష్ బాబు గారు మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# అధిక వడ్డీ రుణాలపై వడ్డీ తగ్గింపు

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన చర్చలో భాగంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూనే.. వైసీపీ గత పాలనపై మంత్రి మండిపడ్డారు. 'వైసీపీ నెవర్ ఎగైన్.. కూటమి వన్స్ ఎగైన్' అంటూ పయ్యావుల వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి వైసీపీ హానికరం అనే స్టాట్యూటరీ వార్నింగ్ నిరంతరం ఇస్తూనే ఉండాలని స్పష్టం చేశారు. ఇజ్రాయిల్ దేశస్థుల తరహాలో ప్రజలు కూడా మన రాష్ట్రం అనే భావనను పెంపొందించుకోవాలని సూచించారు. కూటమి జరిపిన భూ కేటాయింపుల వల్ల కలిగిన లాభాలను.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిపిన భూ కేటాయింపుల వల్ల కలిగిన నష్టాలను మంత్రి సభలో ఏకరువు పెట్టారు. సీఎం చంద్రబాబు హయాంలో భూములు కేటాయిస్తే... కియా, హెచ్‌సీఎల్, అశోక్ లేలాండ్, హీరో కంపెనీ, టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్ ఏఐ డేటా సెంటర్ వంటి సంస్థలు వచ్చాయని తెలిపారు. వైసీపీ హయాంలో ఇచ్చిన భూముల్లో ఒక్క కంపెనీ కూడా రాలేదని గుర్తుచేశారు. లేపాక్షి నాలెడ్జ్ హబ్, వ్యాన్ పిక్, బ్రాహ్మణి స్టీల్స్‌కు భూములిచ్చినా.. ఒక్క ఎంఎస్ఎంఈ కూడా రాలేదని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్ అంశంపై సభలో పయ్యావుల ఆసక్తికర కామెంట్లు చేశారు. సీఎం చంద్రబాబు తీసుకున్న చొరవతో పరిశ్రమల్లోనే కాదు.. పొలాల్లో కూడా పెట్టుబడులు పెడుతున్నారని తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చి కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని పొలాలను కొంటున్నారని, దానిమ్మ పండిస్తున్నారని వెల్లడించారు. చంద్రబాబు చొరవతో రాయలసీమ ఉత్పత్తులకు అరకు తరహాలో అంతర్జాతీయ బ్రాండింగ్ రాబోతోందం టూ సంతోషం వ్యక్తం చేశారు. అలాగే, రాయలసీమ ప్రాజెక్టులకు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన ద్రోహాన్ని మంత్రి పయ్యావుల వివరించారు. 102 రాయలసీమ ప్రాజెక్టులను ఒక్క సంతకంతో రద్దు చేశారని జగన్‌పై ÷ర్ అయ్యారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిర్మించడం లేదని నాడు కేంద్రానికి అప్పటి ఇరిగేషన్ స్పెషల్ సీఎస్‌గా ఉన్న ఆదిత్యనాథ్ దాస్ స్పష్టం చేశారంటూ డాక్యుమెంట్లను మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టారు. తన బడ్జెట్ రిప్లైలో 'ఒక్క ఓటు.. వంద లాభాలు' అంటూ కూటమి ప్రభుత్వం చేసిన పనులను మంత్రి పయ్యావుల ప్రస్తావించారు. అమరావతికి రూ.12 వేల కోట్లు, పోలవరానికి రూ.15 వేల కోట్లు, విశాఖ స్టీల్ ప్లాంట్ పునరద్ధరణకు రూ.11 వేల కోట్లు,విశాఖకు గూగుల్ డేటా సెంటర్, విశాఖకు రైల్వే జోన్,పూర్వోదయ స్కీం, రాయలసీమ హర్టికల్చర్ హబ్,అమరావతికి క్వాంటమ్ వ్యాలీ,విద్యుత్ ఛార్జీల తగ్గింపు, వేలాది కోట్ల నేషనల్ హైవే ప్రాజెక్టులు, రైల్వే లైన్లు ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ఎ÷–లాంట్,ఒక్క ఓటు టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలు, కేవలం మూడు రోజుల్లో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులకు 610 ఎంఓయూలు, ఆడబిడ్డలకు భద్రత, రాయలసీమకు హంద్రీ – నీవా కాల్వల ద్వారా కృష్ణా జలాలు, అమరావతికి రాజధానిగా చట్టబద్ధత, రాజముద్రతో పట్టాదార్ పాస్ పుస్తకాలు.. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, టీచర్ రిక్రూట్‌మెంట్, పోలీస్ కానిస్టేబుళ్ల నియామకం లక్షల కోట్ల సంక్షేమం,20 లక్షల ఉద్యోగాల కల్పనకు రోడ్ మ్యాప్, లక్షల కోట్ల అభివృద్ధి,పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఇంటింటికి తాగు నీటి కనెక్షన్లు,గుంతల్లేని రోడ్లు వంటివన్నీ చేయగలిగామని వివరించారు. పయ్యావుల సమాధానం ఇస్తుండగా అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు.

# కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయం కోసం రూ.139 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు.సమగ్ర శిక్షా అభియాన్ కింద పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగుల వేతనాలను 50 శాతం పెంచే ఉద్దేశం ఉందా అని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు ప్రశ్నించారు. వీరంతా చాలా తక్కువ జీతాలతో పనిచేస్తున్నారని తెలిపారు. వారి జీతభత్యాలు పెంచాలని, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఆ తర్వాత ఎమ్మెల్యే పార్థసారథి కస్తూరిబా బాలికా విద్యాలయాలపై మాట్లాడారు. కస్తూరిబా బాలికా విద్యాలయాల్లో ఆడపిల్లలకు గొప్పగా విద్యనందిస్తున్నాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు దొరకని పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం 79 శాతం ఉత్తీర్ణత ఉన్న స్కూళ్లు త్వరలో 90 శాతం ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉందని తెలిపారు. మరిన్ని కస్తూరిబా బాలికా విద్యాలయాలను ప్రారంభించాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేశ్ సమాధానం ఇచ్చారు. సమగ్ర శిక్షా అభియాన్ కింద పనిచేస్తున్న ఉపాధ్యాయులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఎంత వేతనం చెల్లిస్తున్నారని మంత్రి నారా లోకేశ్ ప్రశ్నించారు. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువ జీతాలు ఇస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఈ పథకం కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉందని, ఈ అంశాలను కేంద్ర దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే, సీజనల్ హాస్టళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు మంత్రి లోకేశ్. త్వరలోనే వాటిని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. డీఎస్సీలో కర్నూలు జిల్లాకు అదనపు ఉపాధ్యాయులను శాంక్షన్ చేశామన్నారు. త్వరలోనే డీఎస్సీని జాబ్ క్యాలెండర్ కింద విడుదల చేస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. గతంలో క్రైస్తవ ఆస్తులు అన్యాక్రాంతం అయ్యాయా అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అసెంబ్లీలో ప్రశ్న లేవనెత్తారు. గుంటూరులో క్రిస్టియన్ భవన్ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందని అడిగారు ఎమ్మెల్యే. దీనిపై మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సమాధానం ఇస్తూ.. క్రైస్తవ ఆస్తుల విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం లేదని స్పష్టం చేశారు. జగన్ క్రిస్టియన్ కాదని అనుకుంటున్నానని... ఎందుకు ఐదేళ్ల పాటు ఆ క్రైస్తవ భవన్ పూర్తిచేయలేదని ప్రశ్నించారు. ఎందుకు ఆయన తనహయంలో నిధులు ఇవ్వలేదని అడిగారు. ఇప్పుడు కూటమి వచ్చింది కనుక త్వరలోనే పెండింగ్ పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తేస్తామని హామీ ఇచ్చారు. ఇజ్రాయిల్, పాలస్తీనా యుద్ధం జరుగుతున్నందున జెరుసలేం యాత్రకు ఆస్కారం లేకుండా ఉందని మంత్రి ఎండీ ఫరూక్ పేర్కొన్నారు.

# ఉప్పాడతీర ప్రాంత అభివృద్ధే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

9వ తేదీన కాకినాడ కలెక్టరేట్‌లో మత్స్యకారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు అన్వేషించాం. తీర కాలుష్య నివారణ, కోత నివారణ, మత్స్య సంపద వృద్ధి, అధునాతన పద్ధతుల్లో వేట, మార్కెటింగ్ సదుపాయాలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ, ఇలా మత్స్యకారుల జీవితాలకు భద్రత, భరోసా కల్పించేందుకు అవసరమైన ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ ప్రణాళికలో పొందుపర్చాం. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చడంతోపాటు వ్యవసాయ అభివృద్ధి, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన తదితర అంశాలను కూడా పరిగణలోకి తీసుకున్నాం అని ఆయన అన్నారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు, మెరైన్ ఫిషరీస్ నిపుణులు, జిల్లా అధికారుల సహకారంతో రూపొందించిన ఈ ప్రణాళికను త్వరలో పిఠాపురం పర్యటనలో ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

నిర్దిష్ట లక్ష్యంతో రూపొందించిన ప్రణాళిక – ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని పవన్ అన్నారు.

# అప్పుల లెక్కలోనూ బాబు అసత్యాల ప్రచారం

**నా హయాంలో రాష్ట్ర అప్పు రూ.7లక్షల 21 వేల 918 కోట్లు... రూ.9లక్షల 74 వేల కోట్లు అని చంద్రబాబు తప్పుడు ప్రచారం**

**వైకాపా అధినేత, మాజీ సిఎం జగన్ మండిపాటు**

**అమరావతి, ఫిబ్రవరి 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అప్పుల లెక్కల్లో కూడా చంద్రబాబు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని వైకాపా అధినేత, మాజీ సిఎం జగన్ మండిపడ్డారు. 2014 కల్లా అప్పులు రూ.లక్షా 47 వేల 717 కోట్లని.. బాబు దిగిపోయే నాటికి రూ.3లక్షల 90 వేల 247 కోట్ల అప్పులు చేశారని మాజీ సీఎం జగన్ అన్నారు. తాము దిగిపోయే నాటికి రాష్ట్ర అప్పు రూ.7లక్షల 21 వేల 918 కోట్లని.. కానీ.. రూ.9లక్షల 74 వేల కోట్లు అని చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వెల్లడించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉంటూ ఇలా తప్పుడు ప్రచారాలు చేయవచ్చా అని ప్రశ్నించారు. తాజాగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ సీఎం జగన్ మాట్లాడుతూ.. 50 ఏళ్లకే పెన్షన్ అని మరొక హామీ ఇచ్చారని.. రాష్ట్రంలో 50 నుంచి 59 ఏళ్ల లోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు 20 లక్షల మంది ఉన్నారన్నారు.. ఈ మూడు బ్జడెట్లలో మూడు ప్రధాన హామీలకు అతీగతీ లేదన్నారు.. సూపర్ ఎ÷–లాప్ అయిన సినిమా చూపించి సూపర్ హిట్ అని ఎలా అంటారని ప్రశ్నించారు.. ప్రతీ నెల పబ్లిక్ మీటింగ్ పెట్టి ప్రతీ మీటింగ్‌కి 25 వేల పెన్షన్లు కట్ చేస్తున్నారు.. 2024 మార్చి నాటికి రాష్ట్రంలో పెన్షన్లు 66,34,372.. ఈనెల చంద్రబాబు ఇచ్చిన పెన్షన్లు 60, 96,108.. ఐదు లక్షలకు పైగా పెన్షన్లు కట్ చేశారు.. ఈనెల ఇచ్చిన మొత్తం 2,632 కోట్లు.. ఏడాదికి కావాల్సింది 31,584 కోట్లు.. ఈ ఏడాది బ్జడెట్ పెన్షన్ కోసం చేస్తున్న ఖర్చు 27, 719 కోట్లు.. ఈ డబ్బు మొత్తం 53, 50, 115 పెన్షన్లకు మాత్రమే సరిపోతుంది.. మరి మిగతావాళ్ళవి ఏం చేస్తారు.. దాదాపు ఏడు లక్షల పెన్షన్లకు కేటాయింపులు ఎలా చేస్తారు.. తల్లికి వందనం పేరిట మరో మోసం.. రాష్ట్రంలో జఆఎ÷ూఇ డేటా ప్రకారం మా హయాంలో బడికి పోయే పిల్లలు 87, 41,885 పిల్లలు.. ఒక్కొక్కరికీ 15 వేల చొప్పున ఇస్తే 13, 112 కోట్లు ఖర్చు అవుతుంది.. ఇప్పటివరకు ఇచ్చింది కేవలం 8,456 కోట్లు.. దాదాపు 20 లక్షల మంది పిల్లలకు ఎగగొట్టారు.. ఉచిత బస్సు పథకం ద్వారా రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడకు అయినా వెళ్లవచ్చు అని చెప్పారు.. ఏపీఎస్ఆర్టీసీలో 16 రకాల సర్వీసులు ఉంటే 5 సర్వీసులకు పరిమితం చేశారు.. ఉచిత గ్యాస్ అని మరో మోసం.. రాష్ట్రంలో మొత్తం గ్యాస్ కనెక్షన్స్ 1.59 కోట్లు.. ఒక్కొక్కరికి మూడు సిలిండర్లు ఇస్తామన్నారు.. ఏడాదికి మొత్తం నాలుగు వేల కోట్లు ఇవ్వాల్సి ఉండగా బ్జడెట్‌లో కేటాయించింది 2600 కోట్లు.. గ్యాస్‌లో కూడా బాకీ పెట్టారు.. వ్యవసాయ రంగానికి అన్నదాత సుఖీభవ అన్నారు.. మా హయాంలో చెప్పిన దాని కన్నా పెంచి ఇచ్చాం.. కేంద్రం ఇచ్చేది కాకుండా మేము 20 వేలు ఇస్తామని చెప్పారు.. 10,717 కోట్లు ఏడాదికి రైతులకు అన్నదాత సుఖీభవ పథకానికి ఇవ్వాలి.. మొత్తం రెండేళ్లకు ఒక్కొక్కరికీ 40 వేలు ఇవ్వాల్సి ఉండగా కేవలం 10 వేలు ఇచ్చారు.. చాలా మందికి పథకం ఎగరగొట్టారు.. వ్యవసాయ మంత్రి 6300 కోట్లు ఇచ్చామని అబద్దాలు చెప్తున్నారు.. 21 వేలు ఇవ్వాల్సి ఉంటే నాలుగు వేల కోట్లు ఇచ్చారు.. వరుసగా మూడవ బడ్జెట్ లో కూడా కౌలు రైతుకు సున్నా.. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక 17 సార్లు విపత్తులు సంభవించాయి.. చంద్రబాబు పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్ పథకం అందుబాటులో లేకపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

# ఫిబ్రవరి 22న గుంటూరులో భారీ 'గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనం

**ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు**

**అమరావతి, ఫిబ్రవరి 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారతీయ తపాలా శాఖలో అంతర్భాగమై, గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న గ్రామీణ డాక్ సేవకల అంకితభావాన్ని గుర్తిస్తూ, వారిని సన్మానించాలని కేంద్ర సమాచార మరియు గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రివర్యులు డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ గారు సంకల్పించారు. వారి ఆలోచనలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్, ఫిబ్రవరి 22, 2026 న , గుంటూరులో భారీ GDS సమ్మేళనం' నిర్వహించనుంది. గ్రామీణ ప్రాంతాల్లో పోస్టల్, బ్యాంకింగ్ మరియు ఇన్సూరెన్స్ సేవలను సామాన్యుడి ముంగిటకి చేరుస్తూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ఈ వేదికపై ప్రత్యేక పురస్కారాలు అందించి సత్కరించనున్నారు. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మరియు ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి వర్యులు శ్రీ జ్యోతిరాదిత్య సింధియాగారు మరియు తపాలా శాఖ ఉన్నతాధికారులు ఈ జీడిఎస్ సమ్మేళనంకు హాజరవుతారని తపాలా శాఖ ఒక ప్రకటన లో తెలియజేసింది. ఈ సమ్మేళనం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న పోస్టల్ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయడానికి మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా చేరవేయడానికి, ఒక గొప్ప వేదికగా నిలవనుందని తపాలా శాఖ తన ప్రకటనలో తెలియజేసింది. ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లోని వివిధ విభాగాల నుండి సుమారు తొమ్మిది వేలమంది గ్రామీణ డాక్ సేవక్ లు ఈ సమ్మేళనానికి హాజరుకానున్నారు. ఈ సమ్మేళనం, గ్రామీణ ప్రాంతాల్లో విశిష్ట సేవలందిస్తున్న జిడిఎస్ లను ఉత్తేజ పరచటానికి దోహద పడుతుందని అందరూ భావిస్తున్నారు.

# ఉదయ్ కుమార్ రెడ్డిపై చర్య తీసుకోండి

- హత్యకేసు నిందితుడిని ఎలా కొనసాగిస్తారు
- యుసిఎల్ జీఎం సుమన్ సర్కార్‌కు సునీత లేఖ

**అమరావతి, ఫిబ్రవరి 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకేసులో నిందితుడిగా ఉన్న ఉదయ్ కుమార్‌రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని యురేనియం కార్పొరేషన్ లిమిటెడ్ జీఎం సుమన్ సర్కార్‌కు వివేకా కుమార్తె సునీత లేఖ రాశారు. బెయిల్‌పై ఉన్న ఉదయ్ కుమార్‌ను ఇప్పుడు మళ్లీ ఎలా విధుల్లోకి తీసుకుంటారని ప్రశ్నించారు. హత్య కేసులో నిందితుడిగా ఉన్నప్పటికీ.. ఉదయ్ కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవడంలో స్థానిక యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆమె పేర్కొన్నారు. శాఖాపరమైన దర్యాప్తును వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఉదయ్ కుమార్ రెడ్డి ప్రవర్తన, సీబీఐ అధికారిపై ఆయన చేసిన ఫిర్యాదుపై కూడా విచారణ జరగాలని విజ్ఞప్తి చేశారు. దయ్ కుమార్‌రెడ్డిని సస్పెండ్ చేయడంలో 11 నెలలు జాప్యం చేసిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని సునీత కోరారు. ఏప్రిల్ 2023 నుంచి చేసిన చెల్లింపులపై పూర్తి స్థాయి ఆడిట్ చేయాలన్నారు. ఉదయ్ కుమార్‌రెడ్డిపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను 15 రోజుల్లో తమకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని కోరారు. హత్య కేసులో నిందితుడిపై చర్యలు తీసుకోవడంలో స్థానిక యంత్రాంగం విఫలమవడంపై సునీత అసంతృప్తి వ్యక్తం చేశారు. క్రమశిక్షణా చర్యలు తీసుకోవడంలో జాప్యం, పాలనాపరమైన లోపాలపై తాను అవసరం అయితే విజిలెన్స్, న్యాయపరంగా చర్యలు తీసుకుంటానని లేఖలో సునీత హెచ్చరించారు. వైఎస్ సునీత గురువారం మీడియాతో మాట్లాడుతూ.. 'మా తండ్రి హత్య కేసులో ఏ6 అయిన గజ్జల ఉదయ్ కుమార్‌రెడ్డి సుమారు 500 రోజులు జైల్లో ఉన్నారు. అలాంటి వ్యక్తిపై యురేనియం కార్పొరేషన్ ఎందుకు చర్యలు చేపట్టలేదు. బెయిల్‌పై ఉన్న ఉదయ్ కుమార్‌ను ఇప్పుడు మళ్లీ ఎలా విధుల్లోకి తీసుకుంటారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలో ఇలా ఎప్పుడూ జరగలేదు. 495 రోజులు జైల్లో ఉంటే యూసీఐఎల్ సంస్థలో ఎలాంటి సెలవు పెట్టాడు. ఎందుకు చర్యలు చేపట్టలేదు. ఈ విషయంపై సీఎం చంద్రబాబును కలిసి వివరిస్తాను' అని అన్నారు.

# అట్టడుగున ఆంధ్ర రాష్ట్ర పురోగతి

- వృద్ధిరేటులో దూసుకుపోతున్నట్లు ప్రకటనలు
- రాష్ట్ర ఆదాయాలు పక్కదోవ పట్టాయి
- దోచుకో..పంచుకో..తినుకో
- ఇదే చంద్రబాబు విధానం అంటూ జగన్ విమర్శలు

**అమరావతి, ఫిబ్రవరి 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**మన రాష్ట్ర పురోగతి అట్టడుగున ఉందని..కానీ వృద్ధిరేటులో దూసుకుపోతున్నట్లు చంద్రబాబు చెప్తున్నారని మాజీ సీఎం జగన్ అన్నారు.. చంద్రబాబు ఎవరికి చెవిలో పూలు పెడుతున్నారు.. తాజాగా మీడియా సమావేశం ఏర్పాటు చేసిన ఆయన రాష్ట్ర పరిస్థితులపై మాట్లాడారు. చంద్రబాబు రాష్ట్రానికి సంబంధించిన ఆదాయాలు పక్కదోవ పట్టాయన్నారు.. దోచుకో.. పంచుకో.. తినుకో అన్నట్లుగా టీడీపీ నేతల వ్యవహారం ఉందని విమర్శించారు.. వనరులు మొత్తం దోచేస్తున్నారన్నారు.. ఆయనకు ఒక విమానం.. దాంతో ఒక హెలికాప్టర్ ఉందని.. లోకేష్, పవన్‌కు కూడా సేమ్ అలాగే ఉన్నాయన్నారు. కొలంబో వెళ్ళి మ్యాచ్ చూస్తాడు.. తర్వాత రోజు ఉదయాన్నే విజయవాడ వస్తారని విమర్శించారు. ప్రైవేట్ ఫ్లైట్‌లో కొలంబో వెళ్ళి మ్యాచ్ చూస్తారు.. టీవీలో చూస్తే మ్యాచ్ కనిపించదా?.. నేను కూడా మ్యాచ్ టీవీలోనే చూశానన్నారు. అప్పులపై మళ్ళీ మళ్ళీ గోబెల్స్ ప్రచారాలు చేస్తున్నారని.. ఎన్నిసార్లు సాక్ష్యాలు, ఆధారాలు చూపినా అదే అబద్దాలు ఆడుతున్నారన్నారు.. కుక్క తోక వంకర అన్నట్లుగా చంద్రబాబు వ్యవహారం ఉందని తీవ్రంగా విమర్శించారు.. ప్రజలకు తెలిసిపోతుంది అని బ్జడెట్ పేపర్స్ లో అప్పుల టేబుల్ ఎత్తివేశారన్నారు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదన్నారు. ఇక్కడ దాచిపెట్టవచ్చు కానీ ఇతర నివేదికల్లో ఏమీ చేయలేరని తెలిపారు.. ఎవరి హయాంలో ఎంత అప్పు అనేది కాగ్ విడుదల చేసిన లెక్కలు చూసినా కనిపిస్తుందని క్లియర్ గా ఉంటుందని మాజీ సీఎం జగన్ అన్నారు.. 2023–24 కు రాష్ట్రానికి సంబంధించిన అప్పులు మొత్తం రూ. 2, 57, 509 కోట్లు.. చంద్రబాబు దిగితే నాటికి రూ. 3.90 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయన్నారు.. లెక్కలు ఎంత క్లియర్‌గా ఉన్నా చంద్రబాబు మాత్రం గ్లోబెల్స్ ప్రచారం ఆపరని.. తమకు రూ. 9 లక్షల కోట్లు అప్పులు మిగిల్చి వెళ్లారని ఘోరంగా అబద్దాలు ఆడుతున్నారన్నారు? ఈ ప్రభుత్వం ఈ 20 నెలల కాలంలో చేసిన అప్పులు రూ. 3.17, 448 కోట్లు అని ఆరోపించారు.. వాస్తవాలు ఆధారాలతో కనిపిస్తున్నా బడ్జెట్ డాక్యుమెంట్స్‌తో గేమ్ ఆడుతూనే ఉంటారన్నారు.

# బిసి రిజర్వేషన్లపై కీలక నిర్ణయం

**రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో డెడికేషన్ కమిషన్**

**అమరావతి, ఫిబ్రవరి 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. బీసీ రిజర్వేషన్లకు ఖరారుకు సంబంధించి.. డెడికేటెడ్ కమిషన్‌ను నియమిస్తూ.. సీనియర్ ఐఏఎస్ మాజీ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ నిర్ధారించేందుకు బీసీ జనాభా లెక్క తేల్చాలని కమిషన్‌కు ఆదేశాలు జారీ చేసింది. బీసీ జనాభా లెక్కలను తేల్చేందుకు.. సంబంధిత సంస్థలు, ముఖ్యమైన వ్యక్తులు, ఇతర సంఘాల నుంచి వివరాలు సేకరించాలని ప్రభుత్వం పేర్కొంది. 45 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఏపీ సర్కార్ ఉత్తర్వుల్లో ఆదేశాలు జారీ చేసింది.

# నైజీరియా గనిలో విషయవాయువుల లీక్

**37మందిని బలి తీసుకున్న ఘటన**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ):** నైజీరియాలోని ఓ గనిలో విషవాయువులు లీకయ్యాయి. ఆ విష వాయువులను పీల్చి 37 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 26 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. నార్త్ సెంట్రల్ నైజీరియాలోని ఓ గనిలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుందని అక్కడి పోలీస్ అధికారులు వెల్లడించారు. నార్త్ సెంట్రల్ నైజీరియాలోని ఎ÷–లాటూ రాష్ట్రంలోని ఓ గనిలో ఆకస్మికంగా లెడ్ ఆక్సైడ్, సల్ఫర్, కార్బన్ మోనాక్సైడ్ గ్యాస్‌లు లీక్ అయ్యాయి. ఈ వాయువులు మానవాళికి విషపూరితమైనవి. పైగా గనిలో వెంటిలేషన్ కూడా తక్కువగా ఉండడంతో వీటి ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఈ విష వాయువులను పీల్చి 37 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 26 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని అధికారులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నైజీరియా సర్కారు ఈ ప్రమాద ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించింది. గనిలో విష వాయువులు లీకవుతాయనే విషయంలో అవగాహన లేకపోవడంతోనే ప్రాణనష్టం ఎక్కువగా జరిగిందని అక్కడి మంత్రి చెప్పారు. ప్రమాదానికి కారణమైన గని సక్రమమైనదా, అక్రమమైనదా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# దూసుకు వస్తున్న ఎఐ.. అప్రమత్తతే ముఖ్యం!

ఎఐ దుష్ఫలితాలను చర్చించడం ద్వారా యువత భవిష్యత్ గురించి ఇప్పుడు ప్రపంచం ఆలోచించాలి. ఎఐతో పెనుముప్పు తప్పదని ప్రఖ్యాత కంపెనీలు, నిపుణులు హెచ్చరిస్తున్న వేళ దీనిపై ప్రధానంగా చర్చించాలి. ఎందుకంటే నిరుద్యోగాన్ఇన ఇది పెంచి పోషించడం ఖాయమని అంటున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా-ఎ.ఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026' సందర్భంగా ప్రధానంగా దుష్ఫలితాలను చర్చించాలి. ఉద్యోగావకాశాలు పోతాయని అంటున్నప్పుడు దాని ప్రభావంతో జరిగే నష్టాన్ని చర్చించి, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ప్రాథమిక స్థాయి వ్యవస్థను పూర్తి స్థాయిలో స్వదేశీ పునాదిమీద ఏర్పాటు చేసుకోవడం భవిష్యత్తులో అన్ని విధాల మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. అయితే, ఎలాంటి ముప్పు ఏర్పడబోతుందో అన్నది ప్రధానంగా ఎఐ సమ్మిట్‌లో చర్చిస్తే మంచిది. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ఆ దిశలో నిపుణులతో కమిటీ వేసి చర్చించి, ఉపద్రవానికి ముందే చర్యలకు పూనుకోవాలి. ఢిల్లీ వేదికగా అట్టహాసంగా నిర్వహిస్తున్న ఎఐ సదస్సులో ఈ మేరకు ప్రకటన రావాల్సి ఉంది. భారత్‌ను గ్లోబల్ సౌత్‌కు సాంకేతిక కేంద్రంగా నిలబెట్టాలన్న లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే, ఆ దిశలో తీసుకుంటున్న చర్యలేంటన్నది చర్చకు రావాలి. అంతర్జాతీయ స్థాయిలో నాయకత్వం వహించే సంగతి అలా ఉంచితే ప్రపంచ స్థాయికి సరితూగే లేదా దగ్గరగా ఉన్న పునాది స్థాయి వ్యవస్థ కూడా మన దగ్గర లేదు. ఈ రంగంలో ఇప్పటికే నాయకత్వం వహిస్తూ ప్రపంచానికి దిశా నిర్దేశర చేస్తున్న అమెరికా, చైనాలు పెద్ద ఎత్తున నైపుణ్యాలను, పరిశోధనలను విస్తృతం చేస్తుండగా, మనం ఏం చేయాలి, ఎలా చేయాలి అన్న దాని దగ్గరే ఉన్నాం. అనేకమంది మేధావులు మనచెంత ఉన్నారు. ఎఐ కి సంబంధించిన అనేక విషయాలను అంతర్జాతీయంగా గుర్తించిన నిపుణులు మనవాళ్లలో ఉన్నారు. ఫౌండేషన్ మోడల్ సంగతి అలా ఉంచితే, లార్జి మోడల్స్ ట్రెనింగ్‌కు అవసరమైన హైపర్ స్కేల్ డేటా సెంటర్లు కూడా అందుబాటులో లేవు. ఇవేవీ లేకుండా గ్లోబల్ లీడర్‌షిప్ గురించి, అప్పుడు వెల్లువెత్తే అవకాశాల గురించి మాట్లాడటం ఆకాశానికి నిచ్చెనలు వేయడమే అవుతుంది. సవాళ్లను గుర్తించి, అందుకు సమాధానాలను వెతుక్కునే సమయమిది. ఇంపాక్ట్ సమ్మిట్ కోసం నీతి ఆయోగ్ రూపొందించిన నివేదిక ప్రకారం ఎఐ రంగంలో మన దేశం పూర్తిస్థాయిలో సన్నద్ధం కావడానికి మరో పది నుండి ఇరవై ఏళ్లు పడుతుందని అంటున్నారు. 2047 నాటికి ఎఐ రంగంలో భారత్‌ను సూపర్ పవర్‌గా నిలపనున్నట్లు ప్రధాని నరేంద్రమోడీ చెప్పారు. 'కేవలం ఎఐ వినియోగదారునిగా కాకుండా ఎఐ సృష్టికర్తగా, ఎఐ విప్లవంలో భాగస్వామి దశ నుండి దానిని శాసించే స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దుతున్నాం' అని మోడీ అన్నారు. ఎఐ సదస్సులో ఇదే విషయం చెప్పారు. కొత్త సాంకేతికతను భారత్ ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటోంది. ప్రతిభావంతులకు స్వర్గధామంగా భారత్ ఉంది. ఏఐ కేంద్రంగా ఇండియా మారుతోంది. ఏఐ అనేది ఓ పరివర్తన శక్తి. దాన్ని దుర్వినియోగం చేస్తే విధ్వంసానికి దారితీస్తుంది. ఏఐ అనేది యువత, భారత్‌కు కొత్త విశ్వాసం, ఆస్తిగా ఉంది. తొలినాళ్లలో ఏఐపై అనేక సందేహాలు వచ్చాయి. కానీ ఇప్పుడు ఏఐని యువత ప్రయోజనకరంగా ఉపయోగిస్తోంది. వివిధ రంగాల సమస్యలకు ఏఐ పరిష్కారం చూపుతోందని మోదీ తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో శరవేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో అప్పటికి పరిస్థితులు ఎలా ఉంటాయో, ఏ కొత్త సాంకేతికత ఉనికిలోకి వస్తుందో తెలియదు! మరోవైపు ప్రపంచంలో ఎఐ అభివృద్ధి విస్ఫోటనం చెందుతోంది. శక్తివంతమైన నమూనాలకు శిక్షణ ఇచ్చే కంప్యూటింగ్ శరవేగంగా పెరుగుతోంది. ప్రత్యేకమైన చిప్‌ల తయారీ కోసం పెద్దఎత్తున పోటీ జరుగుతోంది, భారీ టెక్ సంస్థలు ఎఐలోకి పెద్ద మొత్తాలను కుమ్మరిస్తున్నాయి. 2024 నుండి అమెరికా, చైనాలు ఈ రంగంపై దృష్టి సారించి భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నాయి. మన దేశంలో ఈ రంగ అభివృద్ధి కోసం ఇప్పుడిప్పుడే పరిశోధనలు మొదలయ్యాయి. మరోవైపు ఎఐ వద్ది పేరుతో వ్యక్తిగత గోప్యతకు ముప్పు తలెత్తే ప్రమాదం ఉంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడనుంది. న్యాయవ్యవస్థలో కూడా ఎఐ వినియోగంపై జాగ్రత్త అవసరమని ఇటీవల సుప్రీంకోర్టు సూచించింది. ఆరోగ్య రంగంలోనూ ఇటువంటి ఆందోళనలే వ్యక్తమవుతున్నాయి. మీడియా, రాజకీయ రంగాల్లో డీప్‌ఫేక్‌ల భయాలు ఇప్పటికే ప్రారంభమైనాయి. పెద్ద టెక్ సంస్థల ఆధిపత్యం పెరిగితే డేటా, మౌలిక వసతులు వారి చేతుల్లోనే కేంద్రీకృతమయ్యే ప్రమాదం ఉంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని బలమైన పారదర్శక చట్టాలు, డేటా రక్షణ, నైతిక నియంత్రణ, సమగ్ర శిక్షణ విధానాలను రూపొందించాల్సి ఉంది. దేశంలో ఉన్న యువశక్తిని సమర్థవంతంగా వినియోగిం చుకోవడంతో పాటు, డేటా సెంటర్లు, ఫౌండేషన్ మోడల్స్, చిప్ తయారీ వంటి అంశాలపై దృష్టి సారించాలి. ఢిల్లీ ఎఐ సదస్సులో చోటుచేసుకున్న సాంకేతిక లోపాలతో పాటు, మేడ్ ఇన్ చైనా రోబోడాగ్‌ను తమ సొంత ఆవిష్కరణగా ప్రకటించుకుని నగుబాటైన గల్గోటియాస్ యూనివర్శిటీ నిర్వాకం అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్టను మసకబార్చాయి. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చూడాలి. అన్నింటికి మించి నిరుద్యోగానికి సవాల్‌గా మారిన ఐఎని ఎలా అధిగమించాలన్న దానిపై ప్రయత్నాలు జరగాలి.

# నెవిటేర్ ఎఫెక్ట్..

### విమాన సర్వీసులకు అంతరాయం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ఆర్ఎన్ఎ):** దిల్లీ, ముంబయి సహా దేశవ్యాప్తంగా ఉన్న పలు ఎయిర్‌పోర్టుల్లో విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. దాంతో వందలమంది ప్రయాణికులు ఇబ్బందికి గురయ్యారు. నెవిటేర్ వ్యవస్థలో 45 నిమిషాల పాటు సాంకేతిక లోపం తలెత్తడంతో ఈ పరిస్థితి నెలకొంది. దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం ఉదయం 6.45 గంటల సమయంలో ఈ సాంకేతిక సమస్య తలెత్తింది. బుకింగ్, చెక్‌ఇన్ కోసం ఎయిర్‌లైన్ సంస్థలు ఉపయోగించే నెవిటేర్ వ్యవస్థలో ఈ సమస్యను గుర్తించారు. గంటలోపే దానిని పరిష్కరించారు. అయితే ఈ సమయంలో సిబ్బంది బుకింగ్, చెక్‌ఇన్‌లను మాన్యువల్‌గా నిర్వహించాల్సి వచ్చింది. దాంతో రద్దీ భారీగా పెరిగింది. ముంబయిలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. దాంతో ఇండిగో, ఆకాశా ఎయిర్, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులపై ప్రభావం పడింది. రిజర్వేషన్లు, చెక్‌ఇన్, బోర్డింగ్ కోసం కీలకమైన ఎయిర్‌లైన్ టెక్నాలజీని నెవిటేర్ అందిస్తోంది. అది విఫలమైతే.. ప్యాసింజర్ వివరాలను ప్రాసెస్ చేయడంలో అంతరాయం ఏర్పడుతుంది. ఇది జాప్యాలు, రద్దీకి దారితీస్తుంది. కాగా.. గత నవంబర్‌లో దిల్లీలోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య కారణంగా 800కు పైగా విమానాలు ఆలస్యమైన సంగతి తెలిసిందే. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే దిల్లీ విమానాశ్రయం రోజుకు 1500 విమాన సర్వీసుల్ని నిర్వహిస్తోంది. ముంబయి విమానాశ్రయం నిర్వహించే సర్వీసుల సంఖ్య 1000.

# వచ్చే మేలో పార్టీని ప్రకటిస్తా

### ప్రధాన ప్రతిపక్షంగా ఎదుగుతాం... అధికారంలోకి రావడం ఖాయం... తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత




**హైదరాబాద్,ఫిబ్రవరి 19(ఆర్ఎన్ఎ):** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ పార్టీ ప్రకటనకు ముహూర్తం ఖరారు చేశారు. మే నెల మొదటి వారంలో మంచి రోజు చూసుకుని పార్టీని అధికారికంగా ప్రకటిస్తామని ఆమె వెల్లడించారు. పార్టీ పేరులో 'తెలంగాణ' అనే పదం తప్పనిసరిగా ఉంటుందని కవిత స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తన మొదటి ఛాయిస్ సిద్దిపేట అని, రెండో ఛాయిస్ బోధన్ అని పేర్కొన్నారు. భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీ ఉండదని, ప్రధాన ప్రతిపక్షంగా తామే అవుతామని కవిత ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి తామే వస్తామని, ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలతో పాటు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా పోటీ చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ దారిలోనే వెళ్తోందని, కొత్త తరహా రాజకీయం చేయడం లేదని విమర్శించారు. తన పార్టీ వ్యక్తుల మీద కాకుండా వ్యవస్థల మీద నడవాలన్నారు. ప్రాంతీయ పార్టీలు లీడర్ సెంట్రిక్‌గా ఉంటాయని.. కానీ వ్యవస్థ నిర్మాణం జరగాలని,సైద్ధాంతిక పునాది ఉండాలని అన్నారు. మహిళలను అవమానించవద్దన్నారు కవిత. వైఎస్ షర్మిలా రెడ్డి నేడు ఏపీలో ఒక జాతీయ పార్టీకి అధ్యక్షురాలిగా ఉన్నారని.. కానీ, షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడం ప్రజలకు నచ్చలేదని తెలిపారు. చిరంజీవి పార్టీ పెట్టి మూసివేయలేదా అని ప్రశ్నించారు. 'నా లైన్‌లో నేను వెళ్తున్నా.. నా ప్రయత్నం నాది' అని అన్నారు. తెలంగాణ వాదమే తమ పార్టీ మొదటి లైన్ అని తేల్చిచెప్పారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు కింది స్థాయి నుంచి వచ్చినవారు కేంద్ర మంత్రులు అయ్యారని చెప్పుకొచ్చారు. కొత్త తరానికి తాను పెట్టబోయే పార్టీలో అవకాశాలు ఉంటాయని కవిత పేర్కొన్నారు.

# వేళంగిలో భూమాఫియా పంజా: ప్రభుత్వ భూమి మాయం.. దళితుల దారే దాయం!

### కాలువలను కమ్మేస్తున్న కాసుల కక్కుర్తి... మాయాజాలంగా మారిన సర్వే నంబర్లు... అనుమతులు లేని అక్రమ దందా



**కరప ఫిబ్రవరి 19 (నేటి మనదేశమ్):** కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని కరప మండలం వేళంగి గ్రామం ప్రస్తుతం భూ ఆక్రమణదారులకు అడ్డాగా మారింది. సామాన్యుడికి రక్షణగా ఉండాల్సిన చట్టం ధనవంతుల ముందు మోకరిల్లుతోందా అన్న అనుమానాలు గ్రామస్థుల్లో బలపడుతున్నాయి. ఎంతో విలువైన ప్రభుత్వ ఆస్తులు, సాగునీటి కాలువలు రాత్రికి రాత్రే ప్రైవేటు వ్యక్తుల పరమవుతుంటే, అడ్డుకోవాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తుల్యభాగ కాలువ పరివాహక ప్రాంతంలోని మురుగు కాలువ స్థలం ఇప్పుడు ఆక్రమణదారుల పాలిట కామధేనువుగా మారింది. పంట పొలాలకు నీరు వెళ్లాల్సిన మార్గాన్ని మూసివేసి, ఏకంగా గోడలు నిర్మిస్తున్నా అటు పంచాయతీ వారు గానీ, ఇటు రెవెన్యూ అధికారులు గానీ అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఎకరం విలువ సుమారు ఐదు కోట్ల రూపాయల వరకు పలుకుతుండటంతో, భూబకాసురులు కక్కుర్తి పడి పేదల నోటి కాడ కూడును లాక్కుంటున్నారు. గ్రామ కంఠం భూమి అంటే అది ఊరి ఉమ్మడి ఆస్తి. కానీ, సర్వే నంబర్లు 205/1, 205/2, 205/3, 206/4 లలో ఉన్న విలువైన స్థలం మాయాజాలంతో ప్రైవేటు లేఅవుట్‌గా రూపాంతరం చెందింది. నిబంధనల ప్రకారం ప్రధాన రహదారి నుంచి లేఅవుట్‌కు 33 అడుగుల వెడల్పు ఉండాలి. అయితే, తన సొంత భూమిని వదులుకోవడం ఇష్టం లేని సదరు భూస్వామి, ఏకంగా దళితుల స్మశాన వాటికకు వెళ్లే దారినే తన లేఅవుట్ రోడ్డుగా మార్చుకోవడం గమనార్హం. ఈ అక్రమ లేఅవుట్‌లలో సెంటు ఐదు లక్షల రూపాయలకు విక్రయిస్తూ సామాన్యులను బురిడీ కొట్టిస్తున్నారు. ఈ వివాదాస్పద లేఅవుట్‌కు 'కుడా' అనుమతులు లేవు, పంచాయతీ అప్రూవల్స్ ఊసే లేదు. కేవలం అధికారుల అండ ఉందన్న ధీమాతోనే ఈ దందా సాగుతోంది. స్థానికులు పదేపదే ఫిర్యాదు చేసినా, ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి వచ్చేవరకు పంచాయతీ కార్యదర్శి కనీసం నోటీసులు ఇచ్చే ప్రయత్నం కూడా చేయకపోవడం చూస్తుంటే లోపాయికారీ ఒప్పందాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. పేదలకు ఇళ్ల పట్టాల కోసం కేటాయించాల్సిన భూమిని భూస్వాములకు ధారాదత్తం చేస్తున్న సర్వే అధికారుల తీరుపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై అధికారులను వివరణ కోరగా.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీ-సర్వే రికార్డుల ప్రకారం అన్ని కాగితాలు సరిగ్గానే ఉన్నాయని, సాంకేతికంగా ఎటువంటి ఉల్లంఘనలు లేవని కరప తహసీల్దార్ తుమ్మల దుర్గా ప్రసాద్ పేర్కొన్నారు. వేళంగి గ్రామ కార్యదర్శి ఉమా మహేశ్వరి సదరు లేఅవుట్‌కు ఎటువంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. అది 'అనాధికార లేఅవుట్' అని ప్రజలను అప్రమత్తం చేసేందుకు అక్కడ ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశామని, పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపామని ఆమె తెలిపారు. ?ఈ నేపథ్యంలో, జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వేళంగిలో జరుగుతున్న ఈ భూ దోపిడీకి అడ్డుకట్ట వేసి, అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను, ముఖ్యంగా దళితుల స్మశాన దారిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతినేలా కథనాలు

### సాక్షి మీడియాకు రఘురామరాజు లీగల్ నోటీసులు

**అమరావతి,ఫిబ్రవరి 19(ఆర్ఎన్ఎ):** సాక్షి మీడియాకు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు లీగల్ నోటీసులు జారీ చేశారు. తనకు వ్యతిరేకంగా కథనాలు రాయడంతోపాటు తన వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా కథనాలు ఉంటున్నాయంటూ నోటీసులు పంపారు. గురువారం ఇందిరా టెలివిజన్ ఎండీ వైఎస్ భారతి రెడ్డి, ఎడిటర్, బ్యూరో చీఫ్, బోర్డు డైరెక్టర్లతో సహా సాక్షి మీడియా ప్రతినిధులకు లీగల్ నోటీసులు పంపించారు. నోటీసులను న్యాయవాది ఉమేశ్ చంద్ర జారీ చేశారు. తనకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని నోటీసుల్లో రఘురామ డిమాండ్ చేశారు. లేని పక్షంలో సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా పరిహారంగా రూ.కోటి చెల్లించాలని, ఆ మొత్తాన్ని అమరావతి రైతులకు ఇవ్వాలని నోటీసుల్లో స్పష్టంగా పేర్కొన్నారు.

# అట్రాసిటీ బాధితులకు ఇళ్ల పంపిణీ

### ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నేరాలపై మంత్రి అడ్లూరి..సమీక్ష

**హైదరాబాద్,ఫిబ్రవరి19 (ఆర్ఎన్ఎ):** ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ బాధితులకు మంత్రి అడ్లూరి. లక్ష్మణ కుమార్ ఇళ్ల ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం మల్కాజ్గిరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగింది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక నేరాలపై సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాధితులకు మంత్రి డబల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేయడం జరిగింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం బాధితులకు దళిత, బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం జరిగినప్పుడు, న్యాయం జరిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధంగా వ్యవహరిస్తూ వారికి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం బాసటగా నిలుస్తుందని మంత్రి శ్రీ లక్ష్మణ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ బాధితులకు తగు న్యాయం చేసేలా చొరవ తీసుకోవాలని మంత్రి కోరారు.అనుకోకుండా దురదృష్టవశాత్తు కొన్ని సంఘటనలు జరిగినప్పుడు, బాధితులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అని అన్నారు. కేవలం డబుల్ బెడ్ రూమ్ లతో కాకుండా సంక్షేమ శాఖ ద్వారా బాధితులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రుణాలతో పాటు ఇతర సహాయం, సబ్సిడీ పరంగా అందించేందుకు, జీవనోపాధి కల్పించే విధంగా జిల్లా కలెక్టర్ లు చొరవ తీసుకోవాలని మంత్రి ఆదేశాలు ఇచ్చారు. కనుండి బాధితులకు ఎలాంటి ఆలస్యం జరగకుండా టైం బౌండ్ ప్రోగ్రాం రూపొందించుకొని వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పక్కదారి పట్టకుండా బాధితులకు న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అవమానం నష్టం జరిగిన బాధితులకు పిసిఆర్ పిఓఏ ఆక్ట్ చట్టం ప్రకారం న్యాయం చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు బాధితుల పక్షాన నిరంతరం వారికి సహాయ, సహకారాలు అందిస్తున్నారని మంత్రి కొనియాడారు. ఎస్సీ ఎస్టీలపై ఎలాంటి దాడులు గాని ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడితే, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు ఆదేశించారు.అడ్వాన్స్ టెక్నాలజీని ఉపయోగించి వాస్తవంగా నష్టపోయిన వారికి వీలైనంత త్వరగా న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి అడ్లూరి ఆదేశించారు. దళిత, గిరిజన వర్గాలు చదువు వల్ల గొప్పగా రాణించగలుగుతారని, అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఇంటిగ్రేటెడ్ హాస్టల్ లను నిర్మాణం చేసేందుకు ప్రతి నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయలతో బృహతర కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని మంత్రి అన్నారు. మంచి భవిష్యత్తు ఇవ్వటం మూలానే ఈ వర్గాలు ఉన్నత స్థాయికి చేరుకుంటారని మంత్రి తెలిపారు.

# కాకినాడ రూరల్ పంచాయితీ సెక్రటరీ 'పిడుగు' అవినీతి పై సమగ్ర విచారణ జరపాలి

## బాధితుల డిమాండ్




విజిలెన్స్ కేసులు, కోర్టు కేసులు ఉండి కూడా, ఒకే చోట 18 ఏళ్లుగా కొనసాగడం అనేది ఖచ్చితంగా విచారణార్హమైన అంశం అని ప్రజలు వాపోతున్నారు. కాకినాడ రూరల్ మండలం, రమణయ్యపేట పంచాయితీ కార్యదర్శి పిడుగు పాండురంగారావు సాగిస్తున్న అక్రమాలు, భూ కబ్జాలు, అవినీతిపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని రాయుడుపాలెం గ్రామ బాధితులు పాలిక సత్తియ్యమ్మ, పాలిక రమణ, గుబ్బల సత్యవతి కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు పాలిక సత్తియ్యమ్మ, పాలిక రమణ, గుబ్బల సత్యవతి తెలుగు జనతాపార్టీ జాతీయ అధ్యక్షులు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావును కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. పిడుగు పాండురంగారావు ద్వారా నష్టపోయిన మాకు న్యాయం చెయ్యాలని పెద్దింశెట్టి వెంకటేశ్వరరావును వారు కోరారు. ఇందులో భాగంగ బాధితులతో కలిసి కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ కి వినతిపత్రం. 2008 నుండి నేటి వరకు (సుమారు 18 ఏళ్లుగా) రాజకీయ పలుకుబడితో కాకినాడ రూరల్ పరిధిలోని ఐదు పంచాయితీల్లోనూ చక్రం తిప్పుతూ, ప్రభుత్వ ఖజానాకు సామాన్య ప్రజలకు కోట్లాది రూపాయల నష్టం చేకూరుస్తున్నారన్నారు. గౌరవ లోకాయుక్త, హైకోర్టులో కేసులు ఉన్నప్పటికీ, ఉన్నతాధికారులకు ముడుపులు చెల్లిస్తూ విచారణలు జరగకుండా అడ్డుకుంటున్నారని బాధితులు ఆరోపించారు. పిడుగు పాండురంగారావు ఆస్తులపై ఏసీబీ (ూజదీ) విచారణ జరిపించాలని అదేవిధంగా బాధితులైన తమ భూమిని తమకు దక్కేలా చేసి, అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని జాయింట్ కలెక్టర్ ను కోరారు. రాజకీయనాయకుల అండతో తమ లాంటి సామాన్యులను ఇబ్బంది పెడుతున్న ఇటువంటి అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సారిపల్లి వెంకటరమణ, కలగ శేషుకుమార్, నడే వెంకటరమణ, రేఖా నాగేశ్వరరావు, కర్రి శివ రామకృష్ణ, చింతపల్లి శ్రీను, పాలిక రామ్మోహనరావు, గుత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల లడ్డూ కల్తీపై వైసిపి క్షమాపణలు చెప్పాలి

### కల్తీ జరిగిందని నాటి ఛైర్మన్లు సైతం అంగీకరించారు... మండలిని తప్పు పట్టించిన వైసిపి సభ్యులు... మంత్రి అచ్చన్నాయుడు ఆగ్రహం



**అమరావతి,ఫిబ్రవరి 19(ఆర్ఎన్ఎ):** వైసిపి నేతలు క్షమాపణలు చెప్పిన తరవాతనే చర్చకు ప్రభుత్వం అంగీకరిస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. శాసనమండలిలో తిరుపతి లడ్డూలో కల్తీ జరుగలేదని వైసీపీ నాయకులు చెప్పింది అబద్ధమని మంత్రి ఆరోపించారు. కల్తీ నెయ్యి అంశంపై చర్చ జరపాలంటే ముందు వారు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిందని మాజీ టీటీడీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి స్పష్టంగా చెప్పారని మంత్రి గుర్తు చేశారు. ఈ మేరకు వైసీపీపై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మంత్రి మాట్లాడుతూ.. మూడు రోజుల నుంచి సంబంధం లేని విషయాలు తీసుకువచ్చి సభా సమయాన్ని వైసీపీ సభ్యులు వృథా చేస్తున్నారని మండిపడ్డారు. తిరుమల లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిందని అన్ని నివేదికలు నిర్ధారించాయని, అందుకే కూటమి ప్రభుత్వం పాత టెండర్లను రద్దు చేసి కొత్త టెండర్లను పిలిచిందని మంత్రి వివరించారు. కొత్త టెండర్లలో కిలో నెయ్యి 650 రూపాయలకు ఇచ్చారని చెప్పారు. కిలో నెయ్యి 350 రూపాయలకు ఎక్కడ ఇచ్చారో వైసీపీ సభ్యులు చూపించాలని అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. హెరిటేజ్ డైరీ.. ఉన్నత ప్రమాణాలకు పెట్టింది పేరన్నారు మంత్రి. చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కుటుంబం సభ్యులకు అప్పగించారని తెలిపారు. ప్రభుత్వం నుంచి హెరిటేజ్‌తో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదని పాలసీ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. కల్తీ నెయ్యి మీద చర్చకు అనుమతి ఇవ్వాలంటే, కల్తీ జరుగలేదని చెప్పిన వైసీపీ నాయకులు ముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చీజ్ ప్యాకెట్ చూపించి నెయ్యి ప్యాకెట్ అని చెప్పడం దుర్మార్గమని మండిపడ్డారు. నెయ్యి కల్తీ కాలేదని చెబుతున్న వైసీపీ మాటలన్నీ కల్తీ మాటలే అని మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు చేశారు.

## కిడ్నీ సమస్య ఉన్న వారు

# తినాల్సిన, తినకూడని ఆహారాలు

శరీరంలోని అతి ముఖ్యమైన భాగమైన మూత్రపిండాలు మన శరీరంలోని మలినాలను తొలగించి రక్తాన్ని శుభ్రపరచడానికి పనిచేస్తాయి. మూత్రపిండాలు సరిగా పనిచేయకపోతే శరీరంలో సమస్యలు మొదలవుతాయి. మూత్రపిండాల సమస్యకు చికిత్స ఈ రోజుల్లో అందుబాటులో ఉంది. మూత్రపిండాలు దీర్ఘకాల వైఫల్యానికి గురవుతాయి. ఇందులో కిడ్నీ మార్పిడి లేదా డయాలసిస్ ఉండవచ్చు. ఏదేమైనా, పరిస్థితి స్థిరంగా మరియు ఆరోగ్యంగా ఉండటానికి, పోషకాలను తీసుకోవడం మరియు ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎక్కువ కాలం తినడం అవసరం.

మూత్రపిండాలు పనిచేయకపోతే, శరీరంలో మలినాలు పేరుకుపోతాయి. దీనితో పాటు, రక్తంలో కొన్ని పోషకాలు మరియు ఖనిజాలు తగ్గుతాయి. టాక్సిన్స్ పెరుగుతాయి. మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న వ్యక్తులు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. ఇందులో సోడియం, పొటాషియం,భాస్వరం అధికంగా ఉండే ఆహారాలు ఉండాలి. మూత్రపిండాల వైఫల్యంతో ఈ సూక్ష్మపోషకాలు రక్తంలో పెరిగితే, మీకు మరికొన్ని సమస్యలు ప్రారంభం అవుతాయి. మీకు అధిక రక్తపోటు సమస్య ఉండవచ్చు. ఇది గుండె సమస్యలను కలిగిస్తుంది. శరీరంలో ద్రవం చేరడం. క్రమరహిత హృదయ స్పందన పెరుగుతుంది, ఎముక సమస్య సంభవించవచ్చు.

**ఆరోగ్యంగా తినడం**

అమెరికన్ సొసైటీ ఆఫ్ న్యూరాలజీ యొక్క క్లినికల్ జర్నల్ దాని పరిశోధనలలో, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడం వల్ల మూత్రపిండాల సమస్య ఉన్నవారికి ప్రాణహాని కలిగించే ప్రమాదం తగ్గుతుంది. ఆరోగ్యకరమైన ఆహారం అంటే పండ్లు, తాజా కూరగాయలు, చేపలు, తృణధాన్యాలు, మరియు ఫైబర్లతో కూడిన ఆహారం. మూత్రపిండాల సమస్య ఉన్న రోగులు వారి ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవాలి. ఎర్ర మాంసం, సోడియం మరియు శుద్ధి చేసిన చక్కెర తీసుకోవడం తగ్గించడం ఇందులో ఉంది.

మూత్రపిండాల సమస్య ఉన్నవారు తినవలసిన ఆహారాలు మూత్రపిండాలకు అనుకూలమైన కొన్ని ఆహారాలు ముఖ్యమైనవి.రోగి సలహా తీసుకొని ఆంక్షలు విధించాలి. మీరు కొనగలిగే ఆహార పదార్థాలతో వంటగది నింపాలి. మీకు సరైన ఆహారాలు ఉంటే ఇది చాలా సహాయకారిగా ఉంటుంది. కిడ్నీ వ్యాధి ఉన్నవారు ఎలాంటి ఆహారాలు తినవచ్చో ఇక్కడ మీకు తెలియజేస్తాము.

**తాజా కూరగాయలు**

మీ విలక్షణమైన ఆహారంలో రకరకాల కూరగాయలు (ముడి లేదా వండినవి) ఉండాలి. తులసి, దుంప రూట్, టమోటా మరియు సెలెరీ చాలా మంచి ఎంపిక. దుంప కూరల్లో అధిక స్థాయిలో నైట్రిక్ ఆక్సైడ్ ఉంటుంది, ఇది సహజంగా రక్తాన్ని శుభ్రపరుస్తుంది. ఇండియన్ జర్నల్ ఆఫ్ నెఫ్రాలజీలో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం రక్తంలో నైట్రిక్ ఆక్సైడ్ స్థాయి తక్కువగా ఉంటుంది కాని మూత్రపిండాలకు హాని కలిగిస్తుంది. మీ ఆహారంలో ఫైబర్



ఫుడ్స్ ఉత్తమ ఎంపిక, ఎందుకంటే ఇందులో విటమిన్ బి మరియు ఇతర యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి, ఇవి మూత్రపిండాలను నిర్విషీకరణ చేయడంలో మంచి పాత్ర పోషిస్తాయి. అయితే, పోషకాలను ఎక్కువగా తినకండి. ఎందుకంటే ఇది మూత్రపిండాల్లో రాళ్లకు కారణమవుతుంది.

**పండ్లు**

యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉన్న మరియు కొన్ని పోషకాలను కలిగి ఉన్న కిడ్నీ ఫ్రెండ్లీ పండ్లను రెగ్యులర్ డైట్‌లో తప్పనిసరిగా చేర్చుకోవాలి. మూత్రపిండాలకు సహాయపడే కొన్ని పండ్లు ఇవి. వీటిలో క్రాన్బెర్రీ, బ్లాక్బెర్రీ మరియు పర్పుల్ ఉన్నాయి. నిమ్మకాయ మరియు దానిమ్మపండు రసం కూడా కిడ్నీ ఇన్ఫెక్షన్లను తగ్గిస్తాయి. మూత్ర మార్గ సంక్రమణ (యుటిఐ) ను నివారించడానికి మరియు చికిత్స చేయడానికి క్రాన్బెర్రీ ఉత్తమ ఎంపిక అని న్యూట్రిషన్ జర్నల్ పేర్కొంది. యుటిఐ సమస్య ప్రతినిధులకు రెండు వారాల వరకు పొడి మరియు తీపి కోన్బెర్రీస్ ఇచ్చారు. ఆరు నెలల విచారణ తరువాత, ఈ వ్యక్తులలో యుటిఐ సమస్య లేదు. కాబట్టి స్టోర్ నుండి కాన్బెర్రీని కొని దాని రసం తయారు చేసి, ఉదయం త్రాగాలి. మూత్రపిండాల రక్షణకు ఇది ఉత్తమమైన పద్ధతి. రెస్వెరాట్రాల్, పర్పుల్ ఫ్రూట్ మరియు బ్లాక్బెర్రీస్ లో యాంటీఆక్సిడెంట్ అధికంగా ఉంటుంది. దీర్ఘకాలిక మూత్రపిండాల సమస్యతో బాధపడుతున్న ప్రజలకు ఈ యాంటీఆక్సిడెంట్ చాలా ప్రభావవంతమైన చికిత్స. రెస్వెరాట్రాల్ పాలిసిస్టిక్ కిడ్నీ వ్యాధిని నెమ్మదిస్తుందని అధ్యయనాలు కనుగొన్నాయి. పాలిసిస్టిక్ కిడ్నీ వ్యాధి మూత్రపిండాల తిత్తులు యొక్క దీర్ఘకాలిక సమస్య.

**మరికొన్ని ఆహారాలు**

పండ్లు మరియు కూరగాయలు కాకుండా, మరికొన్ని ఆహారాలను కూడా కిడ్నీ వ్యాధి ఉన్నవారు ఎంచుకోవచ్చు. ఇవి ప్రధానంగా తృణధాన్యాలు, గుడ్లు, కాయలు, చిక్కుళ్ళు, అవిసె గింజలు, డార్క్ చాక్లెట్, నువ్వుల నూనె. కొత్తిమీర, అమరాంత్, అల్లం, దాల్చినచెక్క, పార్స్లీ మరియు మూత్రపిండాల సమస్య ఉన్నవారికి తాజా మూలికలు ,సుగంధ ద్రవ్యాలు మంచివి. నీరు, మరికొన్ని పానీయాలతో మూత్రపిండాలను తేమగా ఉంచడం చాలా అవసరం. హెర్బల్ టీ, నీటిశాతం అధికంగా ఉన్న పండ్లను తీసుకోవాలి.

**తినకూడని ఆహారాలు**

మూత్రపిండాల సమస్య ఉన్నవారు ఎలాంటి ఆహారాలు తినాలో మీకు ఇప్పటికే తెలుసు. కానీ కొన్ని ఆహారాలను ఆహారం నుండి దూరంగా ఉంచాలి. మీరు కొన్ని ఆహారాలను విస్మరిస్తే, ఇది మూత్రపిండాలు బాగా పనిచేయడానికి సహాయపడుతుంది.

ఉప్పు: సముద్ర ఉప్పు, సుగంధ ఉప్పు, అల్లం ఉప్పు, ఉల్లిపాయ ఉప్పు

చికెన్: చికెన్ నగ్గెట్స్, హామ్, సాసేజ్ వంటి ప్రాసెస్ చేసిన మాంసాలు.

తయారుగా ఉన్న సూప్‌లు మరియు నిల్వచేసిన ఆహారాలు. వీటిలో సోడియం అధికంగా ఉంటుంది.



ఆవాల, సోయా సాస్ వంటివి.

శుద్ధి చేసిన నూనెలు: సోయాబీన్, పొద్దుతిరుగుడు

బీర్, సోడా

భాస్వరం అధికంగా ఉండే ఆహారాలు: ఎండిన కాయలు, బ్రోకలీ, పుట్టగొడుగులు మరియు చిక్కుళ్ళు. మీరు తప్పక తినవలసి వస్తే రోజుకు ఒక కప్పు వడ్డించాలి.

అధిక పొటాషియం కలిగిన అవోకాడో, అరటి మరియు నారింజ.

మూత్రపిండాలను శుభ్రపరచండి

ఈ ఆహారంతో, మూత్రపిండాలను శుభ్రపరచడానికి మూత్రపిండాల ఇన్ఫెక్షన్లు, రాళ్ళు మరియు ద్రవం చేరడం , యుటిఐ సమస్యలు వంటి ఇతర సమస్యలు అవసరం. కిడ్నీ ప్రక్షాళన అనేది కూరగాయల రసం, క్యాన్బెర్రీ లేదా పర్పుల్ ఫ్రూట్ స్మూతీ, సలాడ్, చికెన్ భోజనం మూడు రోజులు మాత్రమే తీసుకోవాలి. మీరు దీన్ని అల్పాహారం, భోజనం, విందుగా విభజించాలి. మీకు వీలైతే విందు కోసం సలాడ్, చికెన్ ఉపయోగించండి.

# కర్భూజతో హెయిర్ అండ్ స్కిన్ బ్యూటీ బెనిఫిట్స్

వేసవి కాలం ఎండ, వేడి, హుముడిటి భరించలేనప్పటికీ, వేసవి వినోదం ఈ సమయంలో లభించే పండ్ల నుండి భిన్నంగా ఉంటుంది. మామిడి, పుచ్చకాయ, కర్భుజా, లీచీ, ప్లం, బెర్రీలు, చెర్రీ మొదలైనవి ఈ సమయంలో చౌకగా మరియు సరసమైనవిగా అందుబాటులో ఉంటాయి. ఈ ఆహార పదార్థాల వినియోగం వేసవి తాపానికి సహాయపడటమే కాకుండా, ఎండలో పోగొట్టుకున్న పోషకాలను పొందడంలో సహాయపడుతాయి, అలాగే ఆరోగ్యకరమైన బరువును కాపాడుతుంది. అలాగే, పండ్లలో మంచి ఫైబర్ మలబద్ధకం నుండి రక్షిస్తుంది.

గ్రే లేదా వైట్ కలర్లో ఉండే మస్క్మెలోన్ పండు తింటే కడుపు చల్లగా ఉండటమే కాకుండా, విటమిన్ ఎ, డి మరియు సి అధికంగా శరీరానికి అందిస్తాయి. భాస్వరం, కాల్షియం, మెగ్నీషియం మరియు పొటాషియం వంటి ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి మరియు చర్మ సంరక్షణ , జుట్టుకు సహాయపడతాయి.

వేసవి కాలంలో బయట ఉండే ఉష్ణోగ్రత మీ ఆరోగ్యంతో పాటు చర్మానికి కూడా హానికరం. పుచ్చకాయలను తినడం వేడి, వేడి ప్రభావాల నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. మీ పుచ్చకాయ మీ చర్మానికి కూడా చాలా మేలు చేస్తుందని మీకు తెలుసా. వేసవిలో సంభవించే సన్ టానింగ్, ముడతలు, మచ్చలు మొదలైన వాటిని తొలగించడం ద్వారా పుచ్చకాయ మీకు మృదువైన మరియు అందమైన ముఖాన్ని ఇస్తుంది. మంచి చర్మం పొందడానికి మీరు ఇంట్లో పుచ్చకాయ ఫేస్ ప్యాక్‌లను తయారు చేసుకోవచ్చు. పుచ్చకాయ ఫేస్ ప్యాక్ ఎందుకు ప్రయోజనకరంగా ఉంటుందో, ఎలా తయారు చేయాలో ఇప్పుడు చూద్దాం..

కర్భూజ పండు, ముల్తానిమట్టి ప్యాక్



అవసరమైన మొత్తంలో సుగంధ ద్రవ్యాలతో ఫుల్లర్స్ ఎర్త్ పూతను సిద్ధం చేయండి. మట్టి దొరకకపోతే, ఉప్పును ఉపయోగించవచ్చు. (Haraluppu). ఈ పూతను ముఖం, మెడ మరియు చేతులకు అప్లై చేసి ఇరవై నుంచి ముప్పై నిమిషాలు ఆరనివ్వండి. చల్లటి నీటితో శుభ్రం చేసుకోండి. పూత చర్మాన్ని తేమగా మార్చడానికి మరియు అవసరమైన పోషకాలను గ్రహించడానికి సహాయపడుతుంది, ప్రకాశవంతం చేస్తుంది. తేమను అందిస్తుంది.

**కర్భూజ పండు, ముల్తానిమట్టి ప్యాక్**

కొన్ని కారణాల వల్ల చర్మం చల్లగా లేదా డ్రైగా మారితే, ముల్తాని మిట్టికి బదులుగా బ్రౌన్ షుగర్ జోడించవచ్చు. ఈ ప్యాక్ వల్ల చర్మంలో డెడ్ స్కిన్ సెల్స్ ను తొలగిస్తుంది మరియు కొత్త కణాలు పెరగడానికి అనుమతిస్తుంది. డ్రై స్కిన్ కనిపించకుండా పోయే వరకు మాత్రమే ఈ పూత పూయాలి.

కర్భూజ సుగంధ ద్రవ్యాలు, తేనె, లావెండర్ పూల నూనె ఎనిమిది చుక్కల లావెండర్ ఫ్లవర్ ఆయిల్ మరియు తేనె సమంగా తీసుకుని పూత సిద్ధం చేయండి. పిండి లేదా సెమోలినా (మొక్కజొన్న) వేసి మిక్స్‌లో బాగా కరిగించే వరకు కలపాలి. ఈ పూతను ముఖం, చేతులు మరియు కాళ్ళపై పూయండి. పదిహేను నిమిషాలు అలాగే ఉంచండి. తరువాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోండి. సబ్బు వాడకండి.

**విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది**

రోగనిరోధక శక్తిని పెంచడంలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది చర్మానికి హాని కలిగించే మరియు క్యాన్సర్ కారక ఫ్రీ రాడికల్స్‌తో పోరాడే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. ఇది చర్మం మృదువుగా మరియు ప్రకాశవంతంగా ఉండటానికి సహాయపడుతుంది.

**విటమిన్ సి పుష్కలం**

ముఖ్యంగా వేసవిలో, కర్భూజ తీసుకోవడం వల్ల చర్మం చికాకు, దీర్ఘకాలిక ఆరోగ్య సంకేతాలు తగ్గుతాయి. ఇది మహిళలకు నెలవారీ నొప్పిని తగ్గించడానికి కూడా సహాయపడుతుంది.

**పొటాషియం మంచి మొత్తంలో ఉంది**

ఇది మంచి మొత్తంలో పొటాషియం కలిగి ఉంటుంది మరియు హృదయ స్పందన రేటును సమతుల్యం చేయడానికి సహాయపడుతుంది. ఇది మనస్సు విశ్రాంతి పరచడానికి, ఏకాగ్రతను పెంచడానికి సహాయపడుతుంది. నరాలు, కణాల నాశనాన్ని నివారించడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

**బీటా కెరోటిన్**

బీటా కెరోటిన్ అనే పోషకాలను కలిగి ఉన్న పదార్థం, ఇది కంటి చూపును మెరుగుపరుస్తుంది.

## రాత్రి నిద్రపోయేటప్పుడు సాక్స్ ధరించడం వల్ల ప్రయోజనాలు మీకు తెలుసా?



ఈ వేగవంతమైన ప్రపంచంలో సాయంత్రం ఆఫీసు అయిపోయినప్పుడు మనం అలసిపోతాము. ఇది మనం ఎలా వస్తాము, ఎలా పడుకుని నిద్రపోతాము. ఇలా చాలా అలసిపోయి వచ్చే చాలా మంది ప్రజలు తమ సాక్స్ కూడా తీయకుండా నిద్రపోతారు. కొంతమంది పాదం చాలా గట్టిగా ఉన్నప్పుడు సాక్స్ తో నిద్రపోతారు. నిజానికి, ఇలా నిద్రపోవడం మనకు కొన్ని విధాలుగా ప్రయోజనం చేకూరుస్తుంది. కొన్ని నష్టాలు కూడా ఉన్నాయి. సాక్స్ ధరించడం వల్ల నిద్రపోయేటప్పుడు శరీర జలుబు నుండి ఉపశమనం లభిస్తుంది. ఆశ్చర్యం కదా, మరి ఇదొక్కటే కాదు, ఇంకా ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో చూద్దాం.

**రక్త ప్రవాహాన్ని పెంచుతుంది**

సాక్స్ ధరించడం వల్ల నిద్రపోయేటప్పుడు మీ పాదాలకు రక్త ప్రవాహం పెరుగుతుంది. ఆక్సిజన్ అధికంగా ఉన్న రక్తం ఊపిరితిత్తులు, గుండె కండరాల అంతటా తిరుగుతుందని పరిశోధకులు అంటున్నారు.

**ఉష్ణోగ్రత సర్దుబాటు**

శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలో సహాయపడుతుంది. అందువల్ల మీ శరీర ఉష్ణోగ్రత శీతాకాలంలో కూడా సమతుల్యంగా ఉంటుంది. కాబట్టి శీతాకాలంలో మీ శరీరం వెచ్చగా ఉండ టానికి నిద్రించడానికి ముందు సాక్స్ లు ధరించండి.

**రక్తం గడ్డకట్టడం నివారించడం**

అధిక చలి వల్ల మన కాళ్ళు, కాలి వేళ్ళు గట్టిపడతాయి, మొద్దుబారిపోతాయి. దీనిని ఖండించడంలో విఫలమైతే తీవ్రమైన హాని కలిగించే అవకాశం ఉంది. దీనికి ప్రధాన కారణం ఆ ప్రాంతంలో రక్త ప్రవాహం లేకపోవడం. రక్తం గడ్డకట్టడం మరియు చర్మం లేతగా కనిపిస్తుంది.

**బ్లీచింగ్**

మహిళలు నిద్రపోతున్నప్పుడు సాక్స్ ధరించడం వారి హార్మోన్ల మార్పులను నియంత్రించడంలో సహాయపడుతుంది. మహిళల్లో బ్లీచింగ్ సమస్య హార్మోన్ల మార్పుల వల్ల వస్తుంది. కాబట్టి మీరు మీ పాదాలను వేడిగా ఉంచినప్పుడు రక్త నాళాలు వాసోడైలేషన్ దృగ్విషయం ద్వారా విడదీస్తాయి శరీరం నుండి వేడి బహిష్కరించబడుతుంది. ఆ విధంగా పాదాలు త్వరగా చెమట మరియు చల్లబ రుస్తాయి, విశ్రాంతి నిద్ర, తెల్లబడటం సమస్య తొలగిపోతుంది.

**దుష్ప్రభావాలు**

రక్త ప్రవాహం తగ్గింది రక్త ప్రవాహాన్ని పెంచడం లేదా తగ్గించడం మీరు ఏ రకమైన సాక్స్ ధరిస్తారనే దానిపై ఆధారపడి ఉంటుంది. మీరు టైట్ సాక్స్ ధరిస్తే మీ రక్త ప్రవాహం నిరోధించబడవచ్చు.

**అపరిశుభ్రమైనది**

గట్టి సాక్స్ ధరించి నిద్రపోయేటప్పుడు తగినంత గాలి కాళ్ళ మీద చర్మానికి వెళ్ళదు. అందువల్ల ఈ ప్రాంతం ఫంగల్ ఇన్ఫెక్షన్ మరియు దుర్వాసనకు గురవుతుంది.

# రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం

## ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్,ఫిబ్రవరి19 (ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని, ఈ రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎన్ని నిధులైన ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనుకాడబోదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మైనారిటీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, రోడ్డు రవాణా, నీటిపారుదల శాఖ, సివిల్ సప్లయిస్, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల బ్జడెట్ సమావేశాలు జరిగాయి. సమావేశాల్లో మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజారుద్దీన్ లతో కలిసి డిప్యూటీ సీఎం ప్రీ బ్జడెట్ సమావేశాలు నిర్వహించారు. మంత్రి అజారుద్దీన్ తో కలిసి మైనార్టీ సంక్షేమ శాఖ సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఆలోచించి, నిబద్ధతతో ప్రాధాన్యతను గుర్తించి, ఆదాయం ఖర్చుపై దృష్టి సారించి బ్జడెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. సంక్షేమ శాఖకు సంబంధించి వసతి గృహాలు, గురుకులాల బిల్లులు ఎంత తొందరగా పంపితే అంత తొందరగా క్లియర్ చేస్తామని, వసతి గృహాల భవనాల మరమ్మత్తులు వేగంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని అన్ని వర్గాల విద్యార్థులు ఉమ్మడి కుటుంబం లా కలిసిపోవడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. విద్యార్థులు, టీచింగ్ స్టాఫ్ కు బయోమెట్రిక్ విధానం లేకపోతే వెంటనే అమలులోకి తీసుకురావాలని వాటిని కంట్రోల్ రూమ్ కు అనుసంధానం చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ బిల్డింగ్ ల పైన సోలార్ పవర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ తో సమావేశమై ఏర్పాటు చేసుకోవాలని కరెంటు భారం లేకుండా చేసుకోవడమే కాదు, సోలార్ ద్వారా ఆదాయం సృష్టించుకోవచ్చని తెలిపారు. వసతి గృహాలు, సంక్షేమ హాస్టళ్లకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాం కొత్త మెనూ అమల్లోకి తీసుకు వచ్చాం, వసతి గృహాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం వి నేపథ్యంలో జిల్లా అధికారులు, రాష్ట్రస్థాయి అధికారులు వసతి గృహాలను సందర్శించి అన్ని విషయాలను పరిశీలించాలని వీలైతే ఒక రోజు రాత్రి అక్కడే బస చేయాలని గతంలోనే ఆదేశించాం, ఆ ప్రక్రియ ఎంత మేరకు కొనసాగుతుందో సెక్రటరీలు ఆయా జిల్లా కలెక్టర్ల ద్వారా పర్యవేక్షణ జరపాలని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వసతి గృహాల అద్యలను క్లియర్ చేస్తున్నామని తెలిపారు. హాస్టల్ బిల్డింగుల మరమ్మతు బిల్లులు ఉంటే వెంటనే పంపాలని వెనువెంటనే క్లియర్ చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. వరి సాగు పెద్ద ఎత్తున చేయడం, బాయిల్డ్ రైస్ ను తమిళనాడు వంటి రాష్ట్రాలు కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడం నేపథ్యంలో భవిష్యత్తులో రాష్ట్ర రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉన్న నేపథ్యంలో పంట మార్పిడికి అవకాశాలను పరిశీలించాలని నీటిపారుదల శాఖ సమావేశంలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సూచించారు. వరి స్థానంలో పామ్ ఆయిల్, పప్పు ధాన్యాలు సాగు చేస్తూ, పంట నిలువల స్టోరీ ఈ సామర్థ్యాన్ని రాష్ట్రంలో పెంచాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రభుత్వం బీసీ లకు బ్జడెట్ లో ప్రాధాన్యత కల్పిస్తుంది.. బీసీ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గ్రీన్ చానెల్ ద్వారా డైట్ / కాస్మొటిక్ ఛార్జీలు విద్యార్థులకు స్కాలర్ షిప్ లు విడుదల చేస్తుందనీ డిప్యూటీ సీఎం తెలిపారు. గత ప్రభుత్వం గురుకుల పాఠశాలలు అ÷-దదెలు సంవత్సరాల తరబడి పెండింగ్ లో ఉంచేదని ప్రజా పాలన ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు గురుకుల పాఠశాలలు, బీసీ సంక్షేమ హాస్టల్ ప అ÷-దదెలు చెల్లిస్తుంది. ఈసారి బ్జడెట్ లో బీసీ లలో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి వారి ఆర్థిక వృద్ధి సాధించడానికి ప్రత్యేక పథకాలు ప్రారంభించాలని కోరడం జరిగిందనీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహా లక్ష్మి ద్వారా ఆర్టీసీ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా జరుగుతుంది. ప్రభుత్వం మహా లక్ష్మి నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేస్తుంది. మహా లక్ష్మి కి ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో బస్సులు సంఖ్య కూడా గణనీయంగా పెంచడం జరుగుతుంది. త్వరలోనే ఆర్టీసీ లో ప్రయాణించే మహిళలకు మహా లక్ష్మి కార్డులను ప్రతి ఇంటింటా పండగల అందించడం జరుగుతుందనీ పోను ప్రభాకర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల కోసం హైదరాబాద్ కు వచ్చి ఆర్థికంగా, ఇతరత్రా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు నియోజకవర్గ కేంద్రాల్లో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు ప్రారంభించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం వివరించారు. దేశంలో, రాష్ట్రంలో అత్యుత్తమ ఉపాధ్యాయులను గుర్తించి హైదరాబాద్ నుంచి ఆ÷-లైన్లో పాఠాలు బోధిస్తారని ఇది దేశంలోనే ఒక మోడల్ గా మారబోతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. లోయర్ ట్యాంక్ బండ్, కాచిగూడ కేంద్రంలో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్న విలువైన స్థలాల్లో భారీ బవంతులు నిర్మించి విద్యార్థులకు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు భవనాలు నిర్మించే ఆలోచనలు చేయాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్డూరి లక్ష్మణ్ తెలిపారు. ప్రతి మూడు నెలలకు మిస్ చార్జీలు, అ÷-దదెలు క్లియర్ చేయడం అభినందనీయమని అడ్డూరి లక్ష్మణ్ తెలిపారు. ంక్షేమ వసతి గృహాలు, హాస్టల్లో మోడల్ కిచెన్లు ఏర్పాటు చేసే ఆలోచనను పరిశీలించాలని ఈ పక్రియను దశలవారీగా ప్రారంభించాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. క్ష కోట్లకు పైగా నిధులతో రాష్ట్రంలో రహదారుల నిర్మాణం జరుగుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఊజీప, ఖీఖీఖీ, హైదరాబాద్– విజయవాడ, ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ పోర్టు, రావిర్యాల నుంచి శ్రీశైలం వరకు రహదారుల నిర్మాణం పనులు వివిధ దశలో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి హడ్కో నుంచి రుణం తీసుకునేందుకు డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రీ బ్జడెట్ సమావేశంలో సంతకం చేసి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో, ప్రధానంగా హైదరాబాద్ కేంద్రంలో సంవత్సరం పొడుగునా కల్చరల్ యాక్టివిటీ కొనసాగేలా సినిమాటోగ్రఫీ శాఖలో ప్రణాళిక రూపొందించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సంక్షేమ శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్, రవాణా,రోడ్లు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ, సివిల్ సప్లై శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సంక్షేమ శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్య సాధనలో కీలకంగా లైఫ్ సైన్సెస్

## బయో ఏషియా 2026 ముగింపు వేడుకలో మంత్రి శ్రీధర్ బాబు




హైదరాబాద్,ఫిబ్రవరి19 (ఆర్ఎన్ఎ): తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ పవర్‌హౌస్‌గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. లైఫ్ సైన్సెస్ రంగంలో కేవలం రెండేళ్లలోనే రూ. 73,360 కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, లక్ష ఉద్యోగాలను సృష్టించామని వివరించారు. బుధవారం హైటెక్స్ లో 'బయో ఏషియా 2026' సదస్సులో భాగంగా 'తెలంగాణ రైజింగ్ 2047: బిల్డింగ్ ఏ వరల్డ్ క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకో సిస్టం' పేరిట నిర్వహించిన ముగింపు వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే లక్ష్యంతోనే ప్రజలు, నిపుణుల భాగస్వామ్యంతో 'తెలంగాణ రైజింగ్ 2047'కు శ్రీకారం చుట్టామన్నారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించేలా లైఫ్ సైన్సెస్ రంగం ఎకో సిస్టంను మరింత బలోపేతం చేసేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నా మన్నారు. అందులో భాగంగానే.... తెలంగాణ నెక్స్ట్ - జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ తెలంగాణ లైఫ్ సైన్సెస్ స్కూల్, 1బయో ఇంక్యూబేటర్, జీనోమ్ వ్యాలీ విస్తరణ, ఫార్మా విలేజెస్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ ను మరింత బలోపేతం చేసేందుకుప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ భాగస్వామ్యం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల తయారీకి శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, జాతీయ ఫార్మా ఉత్పత్తుల్లో మూడో వంతు, ఎగుమతుల్లో అయిదో వంతు వాటా తెలంగాణదే కావడం మనకు గర్వకారణమన్నారు. ఈ ఏడాది సదస్సులో సనోఫీ, ఒపెల్లా , వ్యాక్సిండో యానిమల్ హెల్త్, ట్రెడెన్స్, ఆర్ఎక్స్ ప్రొపె÷-లలెంట్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు ముందుకొచ్చాయన్నారు. బ్రిటన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, జపాన్, యూకే తదితర దేశాల నిపుణులతో లైఫ్ సైన్సెస్ రంగంలో రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లు, అనుసరించాల్సిన వ్యూహాలపై నిర్వహించిన ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాలు తెలంగాణ బ్రాండ్ ను మరింత విశ్వవ్యాప్తం అయ్యేందుకు దోహదం చేస్తాయన్నారు. 'బయో ఎకానమీ' రంగంలో మూడో అతిపెద్ద శక్తిగా ఎదగడానికి భారత్ కు ఉన్న అవకాశాలు, తెలంగాణ పాత్రపై చర్చించి... ప్రత్యేక కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసేందుకు వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌తో కలిసి ప్రత్యేక చర్చా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈసారి ఫార్చ్యూన్ 500 కంపెనీల ప్రతినిధులతో పాటు దేశ విదేశాల నుంచి మొత్తం 4,394 మంది ప్రతినిధులు హాజరయ్యారన్నారు. కొత్త పెట్టుబడులు, భాగస్వామ్యాల కోసం 4వేలకు పైగా అత్యున్నత స్థాయి బిజినెస్ టూ బిజినెస్ సమావేశాలకు ఈ ఏడాది సదస్సు వేదికగా నిలిచిందన్నారు. లైఫ్ సైన్సెస్ రంగాన్ని తమ ప్రభుత్వం కేవలం వ్యాపారంగా మాత్రమే చూడటం లేదని, ఒక సామాజిక బాధ్యతగా చూస్తున్నామన్నారు. అన్ని రకాలుగా పారిశ్రామికాభివృద్ధికి అనుకూలంగా ఉన్న రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి రైజింగ్ తెలంగాణలో భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు.

# అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం



**అనంతపురం ఫిబ్రవరి 19 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు మార్చి 31లోపు పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులను కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. అభివృద్ధి పనులపై కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, సమగ్ర శిక్ష, మైనర్ ఇరిగేషన్, తదితర ఇంజనీరింగ్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. రోడ్లు, బ్రిడ్జిలు, విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాల నిర్మాణ పనులు మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి సంబంధించి స్థల సమస్యలను పరిష్కరించాలన్నారు. మార్చిలోపు ఎన్‌హెచ్ఎం (నేషనల్ హెల్త్ మిషన్) స్కీమ్ పనులు పూర్తి చేయకపోతే నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. ఎంపీల్యాడ్స్ నిధుల కింద మంజూరైన పనులు చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌కు సంబంధించి 342 పూర్తయ్యే దశలో ఉండగా, 42 పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. పీఎంశ్రీ, పీఎంఅజయ్, ఆర్థిక సంఘం, ఎంపీ ల్యాడ్స్, సాస్కి, జలజీవన మిషన్, తదితర పథకాలకు సంబంధించిన పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ మురళీకృష్ణ, సీపీఓ అశోక్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, పీఆర్ ఎస్ఈ సుబ్బరాయుడు, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, హెచ్ఎల్‌సీ ఎస్ఈ సుధాకర్‌రావు, ఇతర అధికారులు పాల్గొనారు.

# రాష్ట్ర స్థాయి ప్రాజెక్ట్ డైరెక్టర్స్ సమావేశం -- మెప్మా కార్యకలాపాలపై సమీక్ష




**తాడేపల్లి, ఫిబ్రవరి 19 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మెప్మా ప్రధాన కార్యాలయం తాడేపల్లిలోని మెప్మా హెడ్ ఆఫీస్‌లో రాష్ట్ర స్థాయి ప్రాజెక్ట్ డైరెక్టర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మిషన్ డైరెక్టర్ శ్రీమతి వాకాటి కరుణ, ఐ.ఏ.ఎస్. అధ్యక్షత వహించారు. సమావేశంలో మిషన్ డైరెక్టర్ మాట్లాడుతూ, మరియు మెప్మా యొక్క ప్రధాన దృష్టి ప్రాంతాలుగా కొనసాగుతాయని పేర్కొన్నారు. మొబైల్ బుక్ కీపింగ్ మరియు త్వరలో ప్రారంభం కానున్న "మన డబ్బులు -- మన లెక్కలు" కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సంఘ సభ్యులందరికీ పారదర్శక ఆర్థిక లావాదేవీల ట్రాకింగ్, ఖచ్చితమైన మరియు తాజా సమాచారం అందుతుందని వివరించారు. మిషన్ డైరెక్టర్ మాట్లాడుతూ లు మరియు ఫెడరేషన్లలో కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ అవసరమని పునరుద్ఘాటించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి అన్ని రుణాలు వీజూ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్ ద్వారా మాత్రమే ఇవ్వబడతాయని, డిజిటల్ రీపేమెంట్స్ కూడా ప్రవేశపెట్టబడతాయని తెలిపారు. సమావేశాలు క్రమం తప్పకుండా జరగాలని, వాటిని ఫేషియల్ అటెండెన్స్ మరియు జియో–ఫెన్సింగ్ ద్వారా పర్యవేక్షించాలని, ౹ాణలు వ్యక్తిగతంగా పాల్గొని ౹ాం చురుకైన భాగస్వామ్యాన్ని నిర్ధారించాలని ఆదేశించారు. 2026 మార్చి 31లోపు సభ్యుల నమోదు ప్రక్రియను డూప్లికేషన్ లేకుండా పూర్తి చేయాలని, ఏకీకృత డేటాబేస్‌ను నిర్వహించాలని, ఆడిట్లు, పొదుపులు, రుణాల అప్‌డేట్స్ సమయానికి పూర్తి చేయాలని ౹ాణలకు సూచించారు. మహిళలకు సృష్టిస్తున్న జీవనోపాధి అవకాశాలను ఆమె అభినందించారు. పట్టణ వ్యాపారారంభ కార్యక్రమాలను మరింత బలోపేతం చేసే విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అడిషనల్ మిషన్ డైరెక్టర్ మరియు ౹ావీవీలు జిల్లా వారీగా బ్యాంక్ లింకేజెస్, స్ట్రీట్ వెండర్స్, ప్రేరణ సఖి, రాపిడో వంటి కీలక జీవనోపాధి కార్యక్రమాల పురోగతిని ప్రదర్శించారు. మహిళా ఆకాశం డేటా ఎంట్రీ, పురోగతి, ఆడిట్లు, ౹ాఖఽ సర్వేలు, రిపోర్టులు, మైక్రో క్రెడిట్ ప్లాన్స్, మరియు దీూ లక్ష్యాలు, వెండింగ్ సర్వేలు, సర్టిఫికేట్ జారీ, కొత్త మార్కెట్ ప్రతిపాదనల స్థితి వంటి అంశాలపై అప్‌డేట్స్ ఇచ్చారు. మాట్లాడుతూ, లోన్ అప్లికేషన్లు, ౹ావీ ౹ావూచీఅస్త్రఅ ఆమోదాలు వేగవంతం చేయాలని, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలని సూచించారు. లు తమ సిబ్బందితో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించి, గుర్తించిన లోపాలపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అన్ని ప్రాజెక్ట్ డైరెక్టర్స్, అడిషనల్ మిషన్ డైరెక్టర్, స్టేట్ మిషన్ మేనేజర్లు మరియు హెడ్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.


# మోడీ రాష్ట్రానికి అన్యాయం చేస్తుంటే నోరు మెదపలేని వీళ్లను మగాళ్లనాలా. ఇంకేమైనా అనాలా....: APCC చీఫ్ షర్మిల రెడ్డి



**పల్నాడు ఫిబ్రవరి 19 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పల్నాడు జిల్లాలో గురువారం చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి పరిరక్షణ యాత్ర నిర్వహించారు. పల్నాడు జిల్లాలో వినుకొండ నియోజక వర్గం, వేల్పూరు, నరసరావుపేట నియోజకవర్గం రావిపాడు లో గ్రామ ప్రజలతో రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల రెడ్డి తీవ్రమైన విమర్శలు చేశారు.... ఉపాధి పథకంలో ఊపిరి తీస్తుంటే చంద్రబాబు, జగన్, పవన్ నోరు విప్పడం లేదన్నారు. అక్రమ చట్టానికి చంద్రబాబు మద్దతు ఇవ్వడం దుర్మార్గం అన్నారు. ఆశయాల నుంచి పుట్టిన పథకాన్ని చంపుతుంటే జగన్ నోరువిప్పకపోవడం అన్యాయం అన్నారు. రాష్ట్రానికి మోదీ తీరని అన్యాయం చేస్తుంటే సాగిలపడ్డ వీళ్ళను మగవాళ్లు అనాలా ? ఇంకా ఏమైనా అనాలా ? అని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకం ఆశయాల నుంచి పుట్టిన పథకం అనీ ఆనాడు గ్రామాల్లో కరువును, వలసలు గ్రామాల్లోఆకలి చావులు గ్ర తగ్గాయన్నారు. కరువు పనితో గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. చేసుకోవడానికి పని ఉండేది అనే భరోసా కల్పించారన్నారు. పేదల కడుపు నింపే ఉపాధిపై బీజేపీ కుట్రలు చేస్తోందన్నారు. పథకాన్ని పూర్తిగా రద్దు చేయాలని చూస్తున్నారన్నారు. బీజేపీ అధికారంలో వచ్చాక ఉపాధిలో ఊపిరి తీశారనీ మన్రేగా పథకాన్ని కావాలని చంపుతున్నారన్నారు. కొత్త చట్టం తెచ్చి గ్రామాల్లో ఉపాధి లేకుండా చేశారన్నారు. చట్టం అక్రమ చట్టం మన్రేగా కింద గ్రామంలో ఏం పని కావాలో గ్రామ సభలు నిర్ణయించేవనీ 100 రోజులు పని గ్యారంటీ ఉండేదన్నారు. పురుషులకు , మహిళలకు సమాన వేతనం, పని అడిగిన 15 రోజుల్లో పని కల్పించాతన్నారు. ఉపాధి హామీ పథకంలో కాంట్రాక్టర్లకు ఎంట్రీ లేదనీ చట్టంలో అన్ని తొలగించారన్నారు. పనుల నిర్ణయాధికారం గ్రామసభల నుంచి తొలగించారనీ గ్రామాల్లో జరిగే పనులకు ఢిల్లీ నుంచి నిర్ణయిస్తారనీ మన గ్రామంలో రోడ్డు అవసరం ఉంటే అది కేంద్రంలో ఉన్న పెద్దలకు ఎం తెలుస్తుందనీ అన్నారు. చట్టంలో మళ్లీ కాంట్రాక్టర్లను తీసుకొస్తారన్నారు. పనులను కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు ఉపాధి హామీ శ్రామికులను కాంట్రాక్టులకు లేబర్ సప్లయ్ చేసే వ్యవస్థగా మారుస్తున్నారు చట్టం రాష్ట్రాలకు పెనుభారం మారనుందన్నారు. రాష్ట్రాల నెత్తిన 40 శాతం భారం మోపారు .మన్రేగా కింద రాష్ట్రం మీద 10 శాతం మాత్రమే భారం పడేదనీ కేవలం 800 కోట్లు సర్దితే సరిపోయేదనీ, 20 వేల కోట్ల రూపాయల పనులు రాష్ట్రంలో జరిగేవన్నారు. చట్టంలో 40 శాతం నిధులు భరించాలి అంటే 5 వేల కోట్ల భారం పడుతుందనీ రాష్ట్రం ఇప్పటికే 11 లక్షల కోట్ల అప్పుల్లో ఉందనీ, ఏటా ప్రభుత్వం నడవాలి అంటే 1 లక్ష కోట్ల అప్పులు కావాలన్నారు అప్పుల కుప్ప ఆంధ్రప్రదేశ్ లో ఉపాధికి 5 వేల కోట్లు ఇస్తారా ? అని ప్రశ్నించారు. భారం పడే చట్టంపై టీడీపీ ఎందుకు మద్దతు ఇచ్చిందనీ, సైతం ఉపాధి చట్టంపై పోరాటాలు చేయడం లేదన్నారు. చట్టంతో మోదీ అన్యాయం చేస్తుంటే జగన్ ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. ఈ రాష్ట్రంలో మోదీ తీసుకొనే ఏ నిర్ణయమైనా బాబు , జగన్ , పవన్ నోరు మెదపట్లేదని రాష్ట్రానికి భారం పడే నిర్ణయాలను ఎందుకు వ్యతిరేకించట్లేదు అన్నారు. వీళ్ళకు రాష్ట్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదనీ, రాజధాని లేదు. పోలవరం ప్రాజెక్ట్ అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రానికి మోడి అన్యాయం చేస్తుంటే నోరు విప్పలేని వీళ్ళను మొగవాళ్ళు అనాలా లేదా ఇంకేమైనా అనాలా రాష్ట్ర అభివృద్ధి జరగాలి అంటే మళ్లీ కాంగ్రెస్ అధికారంలో రావాలనీ ఆనాటి పాలన కాంగ్రెస్ తోనే సాధ్యం అన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సిల్వర్ జూబ్లీ ఉగాది ఆహ్వాన నాటికల పోటీలు

## మార్చి 19, 20, 21 తేదీల్లో ప్రదర్శనలు



**రావులపాలెం ఫిబ్రవరి 19 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** తెలుగు నాటికలకు పూర్వ వైభవం తీసుకురావాలనే లక్ష్యంతో ఉగాదికి కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్ (సీఆర్‌సీ) కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో 25 ఏళ్లుగా నాటికల పోటీలను నిర్వహిస్తూ సిల్వర్ జూబ్లీకి దూసుకువెళ్తున్నారు. స్థానిక సీఆర్‌సీ ఓల్డేజ్ హోమ్ మీటింగ్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కళాపరిషత్ కన్వీనర్ గొలుగూరి వెంకటరెడ్డి, సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, కార్యదర్శి నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, కళాపరిషత్ డైరెక్టర్ కె.సూర్య తెలిపారు. మార్చి 19, 20, 21 తేదీల్లో ఉగాది సందర్భంగా ఈ నాటికలను ప్రదర్శిస్తామన్నారు. తొలిరోజు రెండు నాటికలు గోవాడ క్రియేషన్స్ హైదరాబాదు వారి అమ్మ చెక్కిన బొమ్మ, బీవీకే క్రియేషన్స్ కాకినాడ వారి కన్నీటికి విలువెంత, రెండో రోజు మూడు నాటికలు అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి సహాన, తెలుగు కళా సమితి విశాఖపట్నం వారి చిటికెన వేలు, చైతన్య కళా స్రవంతి విశాఖపట్నం వారి అసత్యం, మూడో రోజు రెండు నాటికలు ఎస్‌వీ రంగారావు కళా స్రవంతి కాకినాడ వారి ఆచమనం, భద్రం ఫౌండేషన్ విశాఖపట్నం వారి దొందూ దొందే నాటికలతో పాటు చివరి రోజు సీఆర్‌సీ వారి ప్రత్యేక ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రతి నాటికకు రూ.25 వేల పారితోషికం, ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత బహుమతులు ఉంటాయన్నారు. అలాగే ప్రథమ బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.75 వేలు, తృతీయ బహుమతిగా రూ.50 వేలు ఇవ్వనున్నామన్నారు. సమావేశంలో సీఆర్‌సీ డైరెక్టర్లు మల్లిడి అంజనీకుమార్‌రెడ్డి, కుడుపూడి శ్రీనివాసరావు, జి.రంగనాయకులు, బి.నాగేశ్వరరావు, పలివెల త్రిమూర్తులు పాల్గొన్నారు.

# మేడారం వలీ ఘటన బాధాకరం : మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం ఫిబ్రవరి 19 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మేడారం జాతరలో కోవా బన్ అమ్ముతున్న వలీ విషయంలో చోటుచేసుకున్న ఘటనలు అత్యంత బాధాకరమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మూడు తరాలుగా ఇదే వ్యాపారంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న సామాన్య కుటుంబంపై సోషల్ మీడియా ద్వారా అమానవీయంగా వ్యవహరించడం తీవ్రంగా కలచివేసిందని అన్నారు. వలీ కుటుంబాన్ని పరామర్శించిన ఉర్దూ అకాడమీ చైర్మన్ షుబ్లీ , మంత్రి ని విజయవాడ క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారు తయారు చేసిన కోవా బన్‌ను తిని, కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి మద్దతు తెలిపారు. ఇలాంటి సంఘటనలు మరలా ఎప్పటికీ పునరావృతం కాకూడదని, సమాజంలో పరస్పర గౌరవం, మానవత్వం నిలిచేలా అందరూ వ్యవహరించాలని మంత్రి పిలుపునిచ్చారు.

# మచిలీపట్నంలో ఆర్టీసీ విలీనంపై గళమెత్తిన కార్మికులు



**మచిలీపట్నం ఫిబ్రవరి 19 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తరువాత కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని కార్మిక పరిషత్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. విలీనంపై సమగ్ర చర్చ జరపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మచిలీపట్నంలో జరిగిన కృష్ణా రివిజన్ మహాసభ సమావేశం కు కార్మికులు భారీగా తరలివచ్చి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ప్రభుత్వంలో విలీనం తర్వాత కూడా ముఖ్యమైన సమస్యలు పరిష్కారం కాలేదని ఆయన తెలిపారు. ముఖ్యంగా పెన్షన్ సౌకర్యం వెంటనే కల్పించాలని గతంలో ఉన్న వైద్య సౌకర్యాలను పునరుద్ధరించాలని, పలు సమస్యల ను పరిష్కరించేందుకు కార్మికులకు భరోసా కలిగించే విధంగా స్పష్టమైన విధానాలు ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి మైత్రి ఫౌండేషన్ చేయూత



**మచిలీపట్నం ఫిబ్రవరి 19 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మచిలీపట్నం నియోజకవర్గం పరిధిలోని పోతేపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న కటికల సుబ్బారావు , అర్జా లక్ష్మీ (జిల్లా కోర్టు ఉద్యోగి) కుటుంబం ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో, మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహాయ కార్యక్రమం చేపట్టి చేయూతనిచ్చారు. గ్యాస్ లీకేజ్ కారణంగా గృహం పూర్తిగా అగ్నికి ఆహుతై తీవ్ర ఆస్తి నష్టం వాటిల్లింది అని ఈ పరిస్థితిలో బాధిత కుటుంబానికి మైత్రి ఫౌండేషన్ సభ్యులు గ్యాస్ స్టవ్, మిక్సీతో పాటు ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందించారు. ఈ కార్యక్రమం ద్వారా బాధిత కుటుంబానికి అవసరమైన సహాయం తో పాటు మానసిక ధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా టిడిపి ఇంచార్జ్ కమ్మిలి మధు మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా మైత్రి ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా పరిశీలిస్తున్నానని అన్నారు. ముఖ్యంగా పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ఆర్థికంగా తోడ్పాటు అందిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు కేసాని వేణు కుమార్ , ఉపాధ్యక్షులు రిలాక్స్ ప్రసాద్ , గౌరవ అధ్యక్షులు వరప్రసాద్ , సభ్యులు అనిల్ , లక్ష్మణరావు , మాణిక్యాలరావు,పోతేపల్లి గ్రామ పెద్ద కమ్మిలి మధు , తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, జనసేన ఇంచార్జ్ తోట రాజశేఖర్ పాల్గొన్నారు.. తదితరులు పాల్గొన్నారు. మైత్రి ఫౌండేషన్ భవిష్యత్తులో కూడా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# వైఎస్సార్‌సీపీ నూతన కార్యాలయం పరిశీలన



**అనంతపురం ఫిబ్రవరి 19 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నగరంలోని హెచ్చెల్సీ కాలనీలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలోని మెటీరియల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. నిర్మాణ సామగ్రిని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మొత్తం రూ.40 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు నిర్ధారించారు. పరిశీలించిన వారిలో పార్టీ పార్లమెంట్ పరిశీలకులు నరేష్ రెడ్డి, మాజీ మంత్రి సాకే శైలజానాథ్, నియోజకవర్గ సమన్వయకర్తలు వై.విశ్వేశ్వర రెడ్డి, తలారి రంగయ్య, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.వెంకట్రామి రెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, మేయర్ వసీం సలీం, రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

# వెబ్ ల్యాండ్ అడంగల్ నమోదులో మార్పులు



**(రాజమహేంద్రవరం) ఫిబ్రవరి 19 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రెవెన్యూ రికార్డులలో వెబ్ ల్యాండ్ ఆడంగల్ మార్పుల అధికారాల బదలాయింపు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్.కృష్ణ నాయక్ తెలిపారు. ఆ ప్రకారం వెబ్ ల్యాండ్ ఆడంగల్‌లో మార్పులు, చేర్పులు చేయడంతో పాటు మ్యూటేషన్ ప్రక్రియకు సంబంధించిన అధికారాలు కూడా ఇప్పుడు రెవెన్యూ డివిజనల్ అధికారులకు వర్తించనున్నాయఽ న్నారు. దీని ద్వారా ప్రజలకు వేగవంతమైన పౌరసేవలు అందించడమే లక్ష్యమన్నారు. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో ఇనాం టు జిరాయితీ కేటగిరీలో 29 దరఖాస్తులు స్వీకరించగా 23 పరిష్కరించినట్లు, అలాగే సర్వే నంబర్ నమోదు కేటగిరీలో 22 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.

# రాష్ట్ర బడ్జెట్ పై సర్వత్రా హర్షం

**దీర్ఘకాలిక ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ రూపకల్పన**

**బలహీన వర్గాల ఆకాంక్షాలకు అనుగుణంగా బడ్జెట్ లో కేటాయింపులు.**




**మచిలీపట్నం ఫిబ్రవరి 19 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా, భవిష్యత్ కు భరోసా ఇచ్చేలా బడ్జెట్ ఉందని కృష్ణా జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు ,ఆంధ్రప్రదేశ్ గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి అన్నారు. 2026-2027 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ పై మీడియా సమావేశంలో గురుమూర్తి మాట్లాడారు. స్వర్ణాంధ్ర -2047 లక్ష్యాన్ని సాకారం చేసే దిశగా వేసిన బలమైన అడుగు ఈ బడ్జెట్ అన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి లక్ష్యంగా వ్యవసాయం, పారిశ్రామిక రంగం, సాగునీరు, విద్య, వైద్యం, టూరిజం, పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ రంగాలను బలోపేతం చేసే విధంగా నిధులు కేటాయించారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిన బడ్జెట్ ఇది అని అన్నారు. అదేవిదంగా రూ.3,32,205 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి అభినందనలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన మూలధన వ్యయానికి రూ.53,91 5 కోట్లు కేటాయించడం అభినందనీ యమన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.13,598 కోట్లు, సాగునీటి ప్రాజెక్టులకు రూ.18,224 కోట్లు కేటాయించడం రైతుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చే లక్ష్యంతో గృహనిర్మాణానికి రూ.6,357 కోట్లు కేటాయించారని తెలిపారు. సంక్షేమానికి మొత్తం రూ.91,527 కోట్లు కేటాయించగా, బీసీల అభివృద్ధికి రూ.51,021 కోట్లు, ఎస్టీలకు రూ.9,190 కోట్లు, మైనార్టీలకు రూ.6,090 కోట్లు, మహిళా--శిశు--వికలాంగుల సంక్షేమానికి రూ.4,582 కోట్లు కేటాయించారని వివరించారు. విద్యా రంగానికి భారీ ప్రాధాన్యం ఇస్తూ పాఠశాల విద్య, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధికి గణనీయ నిధులు కేటాయించారని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు రూ.27,719 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు రూ.22,942 కోట్లు, వైద్యశాఖకు రూ.19,306 కోట్లు, వ్యవసాయ విద్యుత్ సబ్సిడీకి రూ.11,000 కోట్లు కేటాయించారని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకానికి రూ.6,600 కోట్లు కేటాయించడం రైతులకు పెద్ద ఊరట కలిగిస్తుందని అన్నారు. గత ప్రభుత్వం అధిక వడ్డీతో అప్పులు చేయగా, ప్రస్తుత ప్రభుత్వం వడ్డీభారం తగ్గించిందని తెలిపారు. వివిధ విభాగాల్లో 30,607 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్టు పేర్కొన్నారు. విజన్ 2047 లక్ష్యంగా ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, వ్యవసాయం విద్య వైద్యం రంగాలను బలోపేతం చేసి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే పెట్టుబడులను ఆకర్షించే విధంగా బడ్జెట్ రూపొందించిం దన్నారు. ఈ బడ్జెట్ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపే ప్రగతి సాధక ప్రజా బడ్జెట్ అని వీరంకి వెంకట గురుమూర్తి గారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మోటమర్రి బాబా ప్రసాద్, జిల్లా కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్,అధికార ప్రతినిధి కోస్తా మురళి, కార్యానివాహక కార్యదర్శి వసంత కుమారి, చిల్లిముంత ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

# శంకర్ డ్రీమ్ ప్రాజెక్టులో ధనుష్?



ఒకప్పుడు శంకర్‌తో సినిమా చేయడానికి వివిధ ఇండస్ట్రీల టాప్ స్టార్లు, అగ్ర నిర్మాతలు లైన్లో ఉండేవారు. మెగాస్టార్ చిరంజీవి అంతటి వాడు.. స్టేజ్ మీద శంకర్‌తో సినిమా చేయాలన్న తన ఆసక్తిని బయటపెట్టుకున్నాడు. అయినా చిరుతో సినిమా చేయడానికి శంకర్‌కు వీలు పడలేదు. తమిళ అగ్ర కథానాయకులతోనే సినిమాలు చేస్తూ పోయాడు శంకర్. కానీ ఇప్పుడు శంకర్‌తో సినిమా చేయాలంటే స్టార్ హీరోలు, నిర్మాతలు భయపడే పరిస్థితి కనిపిస్తోంది. ఐ, రోబో-2లతో అంచనాలను అందుకోలేకపోయిన ఆయన.. ఇండియన్-2, గేమ్ చేంజర్ చిత్రాలతో డిజాస్టర్లు డెలివర్ చేసి తన డిమాండును బాగా తగ్గిపోయింది. ఇప్పుడు శంకరే హీరోలు, నిర్మాతల వెంటపడాల్సిన పరిస్థితి వచ్చింది. 'గేమ్ చేంజర్' తర్వాత కొంచెం గ్యాప్ తీసుకున్న ఆయన.. 'వేల్పారి' అనే బుక్ ఆధారంగా ఒక భారీ చిత్రాన్ని తీయడానికి సన్నాహాలు చేసుకుంటున్నాడు. కొందరు నిర్మాతలను సంప్రదించి నిరాశపడ్డ ఆయన.. బాలీవుడ్‌కు చెందిన పెన్ మూవీస్, అలాగే కోలీవుడ్లో ఆర్ టేక్ స్టూడియోస్ అనే మరో సంస్థతో చర్చలు జరుపుతున్నాడు. మల్టీస్టారర్ అయిన 'వేల్పారి'లో ముఖ్య పాత్రల కోసం విక్రమ్, రణ్వీర్ సింగ్ లాంటి స్టార్లను శంకర్ సంప్రదిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. కాగా ఇప్పుడు ఈ జాబితాలోకి ఇంకో పేరు వచ్చింది. విలక్షణ నటుడు, పాన్ ఇండియా స్థాయిలో ఫాలోయింగ్ ఉన్న ధనుష్‌తో ఓ కీలక పాత్ర కోసం ఒప్పించే ప్రయత్నంలో ఉన్నాడట శంకర్. ఇటీవల ధనుష్ కొత్త సినిమా ఓపెనింగ్‌కు కూడా శంకర్ రావడంతో ఈ ప్రచారం ఊపందుకుంది. ధనుష్ ఏళ్ల తరబడి ఒక ప్రాజెక్టుకు అంకితం అయ్యే రకం కాదు. చకచకా సినిమాలు చేసుకుపోతుంటాడు. కానీ శంకర్‌తో సినిమా అంటే చాలా టైం పడుతుంది. ఏళ్లకు ఏళ్లు సాగుతూ ఉంటుంది. మరి ఈ ఇద్దరికీ ఎలా సింక్ కుదురుతుందో చూడాలి. 'వేల్పారి'లో ధనుష్‌కు ఆఫర్ చేస్తున్నది హీరో పాత్ర కాదు కానీ.. చాలా కీలకమైన క్యారెక్టరే అని సమాచారం. 'వేల్పారి' ఒక తమిళ యోధుడి కథ. 'పొన్నియన్ సెల్వన్' తరహాలోనే ఈ కథకూ పెద్ద హిస్టరీ ఉంది. మరి ఈ కథ అయినా శంకర్ కెరీర్‌ను మళ్లీ పట్టాలెక్కిస్తుందేమో చూడాలి.




## వారణాసికి అన్నీ పక్కా ప్లానింగ్



రాజమౌళి సినిమాలంటే చెప్పిన డేటుకి రావు అని ప్రేక్షకులు ముందే బలంగా ఫిక్సయిపోయి ఉంటారు. ఆయన చివరి చిత్రం 'ఆర్ఆర్ఆర్' రిలీజ్ గురించి కూడా మొదలైనపుడు చాలా ధీమాగా స్టేట్మెంట్ ఇచ్చారు జక్కన్న. 2020 పక్కాగా సినిమా రిలీజవుతుందని ధీమాగా చెప్పారు. తీరా చూస్తే.. కరోనా సహా పలు కారణాల వల్ల ఆ చిత్రం 2022లో కానీ రిలీజ్ కాలేదు. ఆ సినిమా విడుదలప్పుడు ప్రమోషనల్ ఇంటర్వ్యూలో తన మీద వచ్చిన మీమ్స్ చూసి పగలబడి నవ్వాడు రాజమౌళి. 'ఆర్ఆర్ఆర్' కంటే ముందు బాహుబలి, ఈగ చిత్రాలు సైతం అనుకున్న దాని కంటే చాలా ఆలస్యం అయ్యాయి. ఇప్పుడిక వర్తమానంలోకి వస్తే రాజమౌళి కొత్త చిత్రం 'వారణాసి'కి చాలా ముందుగానే రిలీజ్ డేట్ ఖరారు చేశారు. గత ఏడాది టైటిల్ గ్లింప్స్ రిలీజ్ చేసినపుడు 2027 సమ్మర్ రిలీజ్ అని ప్రకటించిన చిత్ర బృందం.. ఇటీవలే ఏప్రిల్ 7 అంటూ డేట్ కూడా ఇచ్చేసింది. కానీ ఆ టైంకి పక్కాగా సినిమా వస్తుందా అనే విషయంలో అనుమానాలతోనే ఉన్నారు ప్రేక్షకులు. కానీ ఈసారి పర్ఫెక్ట్ ప్లానింగ్‌తోనే టీం రంగంలోకి దిగినట్లుంది. సినిమా విడుదలకు 8 నెలల ముందే బ్యాగ్రౌండ్ స్కోర్ పనులు మొదలు కానున్నాయట. తాను ఈ ఏడాది సెప్టెంబరు నుంచే 'వారణాసి'కి బీజీఎం చేయడం మొదలుపెట్టబోతున్నట్లు సంగీత దర్శకుడు కీరవాణి తాజాగా ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆయన ఇంత ముందుగా బీజీఎం పని మొదలుపెడుతున్నారంటే అప్పటికి ఆయన చేతికి ఔట్ పుట్ అంతా వచ్చేస్తుందన్నమాట. భారీగా విజువల్ ఎఫెక్ట్స్, ప్రి ప్రొడక్షన్ వర్క్ ముడిపడ్డ సినిమా 'వారణాసి'. కాబట్టి విడుదలకు చాలా ముందుగానే చిత్రీకరణ పూర్తి కావాలి. ఆ దిశగానే జక్కన్న అండ్ టీం అడుగులు వేస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఈ ఏడాది మధ్యకల్లా షూట్ ఒక కొలిక్కి వచ్చే సంకేతాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం చిత్రీకరణతో పాటే వీఎఫెక్స్ పనులు కూడా సమాంతరంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. అన్నీ ప్లాన్ ప్రకారమే నడుస్తున్నాయి కాబట్టి ఈసారి చెప్పిన రిలీజ్ డేట్‌కు జక్కన్న కట్టుబడితే ఆశ్చర్యం లేదు.

## ఉస్తాద్ బిజినెస్ కెపాసిటీ ఎంత



ఓజి లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత వస్తున్న సినిమాగా ఉస్తాద్ భగత్ సింగ్ మీద క్రమంగా హైప్ పెంచే ప్రయత్నాలు మొదలయ్యాయి. మార్చి 26 విడుదల లాకైపోవడంతో చేతిలో ఉన్న ఇరవై ఏడు రోజులకు సరిపడా ప్రమోషన్లకు దర్శకుడు హరీష్ శంకర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. ఈసారి సోషల్ మీడియా అభిమానులను బాగా యాక్టివ్ చేయబోతున్నట్టు సమాచారం. అయితే ఉస్తాద్ కు ఓజి రేంజ్ లో అంచనాలు లేవు. ఎంత పవన్ కళ్యాణ్ మూవీ అయినా ఎన్గేజ్ మెంట్ కలిగేలా పబ్లిసిటీ మెటీరియల్ సిద్ధం చేయాలి. హరిహర వీరమల్లు విషయంలో ఇది నిర్లక్ష్యానికి గురి కావడం వల్లే ఓపెనింగ్స్ తప్ప పెద్దగా చెప్పుకునే వసూళ్లు రాలేదు. ఉస్తాద్ భగత్ సింగ్ కు ఆ టెన్షన్ లేకపోయినా కాంబినేషన్ పరంగా అభిమానుల నమ్మకం పరంగా ఫిఫ్టీ ఫిఫ్టీ అన్నట్టుగా ఉంది. కారణం దర్శకుడు హరీష్ శంకర్ గత చిత్రం మిస్టర్ బచ్చన్ దారుణంగా పోవడమే. కాకపోతే గబ్బర్ సింగ్ ఇచ్చిన వీరాభిమానిగా ఆయన మీద కాన్ఫిడెన్స్ ఫ్యాన్స్ లో ఉంది. ముందైతే ఇది తేరి రీమేక్ కాదని, స్టోరీ పూర్తిగా కొత్తదనే అభిప్రాయం కలిగించేలా టీజర్, ట్రైలర్ కట్ చేయాలి. ఇక వ్యాపారానికి సంబంధించిన వ్యవహారాలు ఊపందుకున్నాయి. మైత్రి సంస్థ థియేటర్స్ నుంచి వంద నుంచి నూటా యాభై కోట్ల మధ్యలో బిజినెస్ ఆశిస్తోందని ట్రేడ్ వర్గాల సమాచారం. ఇంకా ఫైనల్ కాలేదు. సంక్రాంతి తర్వాత బాక్సాఫీస్ పూర్తిగా డ్రై అయిపోవడంతో ఉస్తాద్ భగత్ సింగ్ కు సునామిలా ఓపెనింగ్ వస్తుందని, మౌత్ టాక్ పాజిటివ్ ఉంటే కనక ఓజి స్థాయిలో రెవిన్యూ ఆశించవచ్చని బయ్యర్లు అంచనా వేస్తున్నారు. సరైన కంటెంట్ లేక థియేటర్లకు దూరంగా ఉన్న మాస్ జనాలు పవన్ కోసం ఖచ్చితంగా వస్తారనేది నిర్మాతల ధీమా.

## విష్ణు డబుల్ ధమాకా లేదు



ఒక హీరో సినిమాలు రెండు ఒకే రోజు రిలీజ్ కావడం అన్నది రేర్ ఫీట్. తెలుగులో ఈ రికార్డు నందమూరి బాలకృష్ణ, నానిల పేరు మీద మాత్రమే ఉంది. తొంభైవ దశకంలో నందమూరి బాలకృష్ణ చిత్రాలు 'బంగారు బుల్లోడు', 'నిప్పురవ్వ' ఇలా రిలీజ్ కాగా.. మళ్లీ చాలా ఏళ్లకు నేచురల్ స్టార్ నాని మూవీస్ 'ఎవడే సుబ్రహ్మణ్యం', 'జెండాపై కపిరాజు' ఒకేసారి ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. రెండుసార్లూ ఒక సినిమా బాగా ఆడింది. ఇంకోటి దెబ్బ తింది. ఐతే గత ఏడాది తమిళ హీరో ప్రదీప్ రంగనాథన్ ఈ ఫీట్ రిపీట్ చేసేలా కనిపించాడు. అతడి సినిమాలు డ్యూడ్, ఎల్ఐకే దీపావళి పోటీకి సై అన్నాయి కానీ.. తర్వాత 'డ్యూడ్' మాత్రమే రిలీజైంది. 'ఎల్ఐకే' వెనక్కి వెళ్లిపోయింది. ఐతే తాజాగా టాలీవుడ్ యంగ్ హీరో శ్రీ విష్ణు సినిమాలు విష్ణు విన్యాసం, మృత్యుంజయ్ ఒక్క రోజు వ్యవధిలో రిలీజ్ కానున్నట్లు ఇటీవల అప్‌డేట్స్ వచ్చాయి. ఈ నెల 27న మృత్యుంజయ్, 28న విష్ణువిన్యాసం రిలీజవుతాయని మేకర్స్ ప్రకటించారు. కానీ ఇప్పుడు కథ మారింది. శ్రీ విష్ణు కూడా ప్రదీప్ రంగనాథన్ బాటలో నడిచాడు. ఒక సినిమాను వాయిదా వేయించాడు. ఈ నెల చివరి వారంలో విష్ణు విన్యాసం మాత్రమే విడుదల కానుంది. చెప్పినట్లే ఈ నెల 28న ఈ చిత్రం విడుదల కానుంది. మృత్యుంజయ్ వాయిదా పడనుంది. ఈ విషయాన్ని విష్ణు విన్యాసం ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో విష్ణు ధ్రువీకరించాడు. మృత్యుంజయ్ కొత్త రిలీజ్ డేట్ మేకర్స్ ప్రకటిస్తారని అతను చెప్పాడు. కొన్ని రోజుల ముందు ఈ రెండు చిత్రాలు ఒకే డేటుకు వస్తాయి అన్నపుడు తాను చాలా టెన్షన్ పడ్డట్లు విష్ణు వెల్లడించాడు. ఆ టైంలో ఏం చెయ్యాలో అర్థం కాలేదని.. ఐతే ఇండస్ట్రీలో చాలామంది నిర్మాతలు, హీరోలు ఫోన్ చేసి టెన్షన్ పడొద్దు అని చెప్పారన్నాడు.



# బిజినెస్ న్యూస్




## స్టూడెంట్స్‌కు అడోబ్ గుడ్‌న్యూస్.. ఈ యాప్స్ ఫ్రీ




ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు అడోబ్ గుడ్‌న్యూస్ చెప్పింది. తన AI-ఆధారిత క్రియేటివ్, ప్రొడక్టివిటీ టూల్స్‌ను ఉచితంగా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపింది. భారత్ మండపంలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమిట్-2026లో భాగంగా ఈ ప్రకటన చేసింది. ఈ ఆఫర్‌లో భాగంగా అడోబ్ ఫోటోషాప్, అక్రోబాట్, అడోబ్ ఫైర్‌ఫ్లై టూల్స్‌ను భారత్‌లోని గుర్తింపు పొందిన విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఉచితంగా పొందొచ్చు. సాఫ్ట్‌వేర్ యాక్సెస్‌తో పాటు, ఈ టూల్స్ ఉపయోగించడంపై శిక్షణ, కరిక్యులమ్, సర్టిఫికేషన్ కూడా అడోబ్ అందించనుంది. కంటెంట్ క్రియేటర్ ల్యాబ్ సదుపాయం ఉన్న 15వేల స్కూళ్లు, 500 కళాశాలల్లో ఉన్న విద్యార్థులకు ఈ సౌలభ్యం లభిస్తుంది. దీంతో పాటు నాస్కామ్‌తో కలిసి AI-ఫస్ట్ లెర్నింగ్ కోర్సులు, సర్టిఫికేషన్లను కూడా అడోబ్ అందించనుంది. దీన్ని అడోబ్ వ్యూహాత్మక పెట్టుబడిగా అభివర్ణించింది. భారతదేశంలోని లక్షలాది మంది విద్యార్థులకు సృజనాత్మకతను పెంచేందుకు అడోబ్ తనవంతు కృషి చేస్తోందని, AI నైపుణ్యాలను పొందడంలో సహకరిస్తోందని అడోబ్ ఛైర్మన్, సీఈఓ శంతను నారాయణ్ పేర్కొన్నారు.

## కెమెరా ప్రియుల కోసం వివో వీ70, వీ70 ఎలైట్



ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ వివో కెమెరా ప్రియుల కోసం దేశీయ మార్కెట్‌లోకి రెండు కొత్త స్మార్ట్‌ఫోన్లను లాంచ్ చేసింది. తన వీ సిరీస్‌లో వీ70, వీ70 ఎలైట్ పేరిట రెండు స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసింది. ఇందులో వీ70 ఎలైట్ హైఎండ్ కాన్ఫిగరేషన్‌తో కూడిన ఫోన్. ఈ రెండు ఫోన్లూ జీస్ (Zeiss) పార్ట్‌నర్‌షిప్‌తో వస్తుండడం విశేషం. 6,500 ఎంఏహెచ్ బిగ్‌బ్యాటరీతో, స్నాప్‌డ్రాగన్ ప్రాసెసర్‌తో వస్తున్న ఈ ఫోన్ల వివరాలు ఇప్పుడు చూద్దాం.

వివో వీ70, వీ70 ఎలైట్ రెండూ ఆండ్రాయిడ్ 16తో కూడిన ఆరిజన్‌ఓఎస్ 6తో పనిచేస్తాయి. వీటికి నాలుగేళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, ఆరేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ చెబుతోంది. రెండు ఫోన్లలోనూ 6.59 అంగుళాల వీఎం9 అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. 120ఎఓ రిఫ్రెష్ రేటుకు, 5000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌కు సపోర్ట్ చేస్తాయి. ఐపీ68, ఐపీ69 రేటింగ్‌తో వస్తున్నాయి. వివో వీ70లో స్నాప్‌డ్రాగన్ 7 జన్ 4 ప్రాసెసర్ అమర్చగా.. వీ70 ఎలైట్‌లో స్నాప్‌డ్రాగన్ 8ఎస్ జన్ 3 చిప్‌సెట్‌ను అమర్చారు. రెండు ఫోన్లలోనూ జీస్ పార్ట్‌నర్‌షిప్‌తో కూడిన ట్రిపుల్ కెమెరా సెటప్ ఉంది. 50 ఎంపీ ప్రైమరీ కెమెరా, 50 ఎంపీ టెలి ఫొటోలెన్స్, 8 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా ఇచ్చారు. రెండు ఫోన్లలోనూ 50 ఎంపీ ఫ్రంట్ కెమెరా ఇచ్చారు. 6,500 ఎంఏహెచ్ బ్యాటరీ, 90ఔ ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయంతో తీసుకొచ్చారు. ఈ ఫోన్ల బరువు 194 గ్రాములు. ఇక ధర విషయానికొస్తే.. వివో వీ70 రెండు వేరియంట్లలో లభిస్తుంది. 8జీబీ 256జీబీ వేరియంట్ ధర రూ.45,999గా కంపెనీ నిర్ణయించింది. 12జీబీ 256జీబీ వేరియంట్ రూ.49,999కు లభిస్తుంది. వీ70 ఎలైట్ మొత్తం మూడు వేరియంట్లలో లభ్యమవుతుంది. 8జీబీ 256జీబీ వేరియంట్ ధరను రూ.51,999గా కంపెనీ పేర్కొంది. 12జీబీ 256జీబీ వేరియంట్ ధర రూ.56,999, 12జీబీ 512 జీబీ వేరియంట్ ధర రూ.61,999గా నిర్ణయించింది. ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యెస్ బ్యాంక్ కార్డులపై 10 శాతం వరకు కంపెనీ డిస్కౌంట్ అందిస్తోంది. ఫ్లిప్‌కార్ట్, వివో ఆన్‌లైన్ స్టోర్లలో లభ్యం కానున్నాయి.

## మార్కెట్‌కు యుద్ధ భయాలు.. 8 లక్షల కోట్లు ఆవిరి



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీగా పతనమయ్యాయి. బ్యాంకింగ్, మెటల్, ఆటో, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు కుదేలయ్యాయి. ఇరాన్‌పై ఏ క్షణంలోనైనా అమెరికా దాడి చేస్తుందన్న భయాలు, ఫెడ్ వడ్డీ రేట్లపై గందరగోళం కారణంగా సూచీలు నేలచూపులు చూశాయి. దీంతో మూడు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. మదుపర్ల సంపద దాదాపు రూ.8 లక్షల కోట్లు ఒక్కరోజులోనే ఆవిరైంది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.472 లక్షల కోట్ల నుంచి రూ.464 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఓ దశలో 1400 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 25,500 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 83,969.82 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,734.25) లాభాల్లో ప్రారంభమైంది. కాసేపు లాభాల్లో కదలాడిన సూచీ.. క్రమంగా నష్టాల్లోకి జారుకుంది. ఈ క్రమంలో ఇంట్రాడేలో 82,264.20 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1236.11 పాయింట్ల నష్టంతో 82,498.14 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 365 పాయింట్ల నష్టంతో 25,454 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో ఒక్కటంటే ఒక్కటీ లాభపడలేదు. ఇండిగో, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్, బీఈఎల్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి.


ప్రధాన కారణాలు ఇవే..

ఇరాన్‌పై ఏ క్షణంలోనైనా అమెరికా దాడికి పాల్పడొచ్చనే భయాలు మన మార్కెట్ సూచీల పతనాన్ని శాసించాయి. ఓ వైపు పశ్చిమాసియాలో అమెరికా తన సైనిక బలాన్ని మోహరిస్తుండగా.. ఇరాన్ తన అణుస్థావరాలను రక్షించుకొనే పనిలో పడింది. దీనికితోడు ఉక్రెయిన్- రష్యా మధ్య అమెరికా మధ్యవర్తిత్వంలో జరుగుతున్న శాంతి చర్చలు కొలిక్కి రాకపోవడమూ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

అమెరికా ఫెడ్‌కు సంబంధించిన మినిట్స్ తాజాగా బయటికొచ్చాయి. వడ్డీ రేట్ల తగ్గింపు విషయంలో ఫెడ్ అధికారుల విషయంలో భిన్నాభిప్రాయాలు నెలకొన్నాయి. తదుపరి ద్రవ్యోల్బణ గణాంకాలు వచ్చేంత వరకు వేచి చూడాలని కొందరు అభిప్రాయపడుతుండగా.. మరికొందరు మాత్రం ద్రవ్యోల్బణం తిరోగమనం పట్టేంత వరకు వడ్డీ రేట్లు తగ్గించకూడదన్న అభిప్రాయంతో ఉన్నారు. దీర్ఘకాలం పాటు అమెరికా వడ్డీ రేట్లు తగ్గించకపోతే భారత్ వంటి వర్ధమాన మార్కెట్‌లకు నిధుల ప్రవాహం తగ్గుముఖం పడుతుంది.

పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకొన్న వేళ అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70 డాలర్ల మార్కును దాటింది. దిగుమతులపై ప్రధానంగా ఆధారపడే మన దేశానికి ఇది ప్రతికూలాంశం. పైగా సెన్సెక్స్, నిఫ్టీ ఇటీవల వరుస లాభాల వేళ మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం, మార్కెట్ సూచీలను ముందుకు నడిపించే పాజిటివ్ అంశాలేవీ లేకపోవడంతో మార్కెట్ సూచీలు భారీగా నష్టపోయాయి.

## ఏఐ రాకతో లేఆఫ్‌ల్లోనూ పోటీ: హెచ్చరించిన అమెరికా వ్యాపారవేత్త



కృత్రిమమేధతో ఉద్యోగాలు పోతాయనే ఆందోళన రోజురోజుకూ తీవ్రమవుతోంది అమెరికా వ్యాపారవేత్త ఆండ్రూ యాంగ్ చేసిన వ్యాఖ్యలు అందుకు తగ్గట్టే ఉన్నాయి. రానున్న 12-18నెలల్లో లక్షల ఉద్యోగాలు పోతాయని, వాటిల్లో భారీ సంఖ్యలో వైట్‌కాలర్ జాబ్స్ ఉంటాయని జోస్యం చెప్పారు. కోడర్స్, మార్కెటర్స్ (ప్రకటనల విభాగ సిబ్బంది), మిడిల్ మేనేజర్లు, కాల్ సెంటర్ సిబ్బంది అందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఒక సంస్థ తన ఉద్యోగుల సంఖ్యలో కోతపెడితే.. ప్రత్యర్థులు కూడా అలాంటి నిర్ణయాలు అమలు చేయాల్సిన ఒత్తిడి తలెత్తుతుందన్నారు. "సిబ్బంది సంఖ్యను తగ్గించుకుంటే స్టాక్‌మార్కెట్ సానుకూలంగా స్పందిస్తుంది. లేకపోతే భిన్నంగా ఉంటుంది. దాంతో ఇదొక పోటీగా మారుతుంది" అని యాంగ్ అభిప్రాయం వ్యక్తంచేశారు. నాన్ టెక్నికల్ విభాగంలో కూడా ఏఐ ప్రభావం ఉంటుందని యాంగ్ వెల్లడించారు. "డ్రై క్లీనర్, డాగ్ వాకర్, హెయిర్‌స్టైలిస్ట్ లాంటి ఉద్యోగాల్లో కొందరు ఉన్నారనుకుందాం. ఇతర ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నవారికి ఉపాధిపోతే ఆ ప్రభావం ఈ చిన్న ఉద్యోగస్థులపై పడుతుంది. ఉతకడానికి బట్టలు ఇవ్వరు. వారి కుక్కలను వారే తీసుకువెళ్తారు.

# జైల్లో ఎంజాయ్ చేసిన అంబటి



**అమరావతి, ఫిబ్రవరి 19 (నేటి మనదేశమ్) :** ఎట్టకేలకు మాజీ మంత్రి అంబటి రాంబాబు రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. అంబటి రాంబాబుపై ఉన్న అన్ని కేసుల్లోనూ ఆయనకు బెయిల్ మంజూరు కావడం, మరే కేసులోనూ పీటీ వారెంట్ ను పోలీసులు కోరకపోవడంతో ఆయన కొద్ది సేపటి క్రితం జైలు నుంచి విడుదలయ్యారు. ఈ సందర్భంగా అంబటిని కలిసేందుకు పలువురు వైసీపీ నేతలు జైలు దగ్గరకు వెళ్లారు. ఈ క్రమంలోనే మీడియా ప్రతినిధులతో మాట్లాడిన అంబటి కీలక వ్యాఖ్యలు చేశారు. తనను అక్రమంగా, అన్యాయంగా జైల్లో పెట్టారని, తన పెళ్లాంబిడ్డలను చంపడానికి ప్రయత్నం చేశారని, అయినా భయపడే ప్రసక్తే లేదని వ్యాఖ్యా నించారు. తాను మరింత పోరాటపటిమతో ముందుకు వెళతానని అన్నారు. తనను జైల్లో పెట్టారని, ఇప్పుడు ఏమయిందని ప్రశ్నించారు. బాధితుడిని జైల్లో పెట్టి నిందితులను వదిలేశారని ఆరోపించారు. తాను జైలు జీవితాన్ని అనుభవించలేదని, ఎంజాయ్ చేశానని అంబటి చేసిన కామెంట్లు వైరల్ అవుతున్నాయి. తాను చేసిన వ్యాఖ్యల పట్ల పశ్చాత్తాప పడ్డానని, తనలా ఎవరైనా చేశారా అని ప్రశ్నించారు. తన పార్టీ నేతలతోపాటు, తన పార్టీకి చెందని వారు కూడా తనకు మద్దతుగా నిలిచారని, వారందరికీ ధన్యవాదలు చెప్పారు అంబటి. దేనికైనా సిద్ధపడి వైఎస్ఆర్, జగన్ వెంట నడుస్తానని...కూటమి ప్రభుత్వాన్ని కూల్చే వరకు ఎన్ని కుట్రలు, కుతంత్రాలనైనా ఎదుర్కొంటానని అన్నారు. బయటి భోజనం తినేందుకు కోర్టు ఆర్డర్ ఇవ్వలేదని, కాబట్టి జైలు అధికారులు వారి రూల్స్ ప్రకారం భోజనం పెట్టారని, కాబట్టి అది తనకు నచ్చకపోయినా తిన్నానని అన్నారు. దాడి సమయంలో అయితే పోలీసులు తనను పారిపోవాలని సలహా ఇచ్చారని కామెంట్స్ చేశారు. తాను ధైర్యాన్ని వీడను, వీడలేదని, ప్రాణాలకు తెగించే ఉన్నానని అన్నారు.

## లడ్డూ తయారీలో

# దేవుడి సొమ్ము దోపిడీపై చర్చ జరగాలి

### శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ



**అమరావతి, ఫిబ్రవరి 19 (నేటి మనదేశమ్) :** 'తిరుమల లడ్డూ తయారీకి వాడిన నెయ్యి కల్తీ అయ్యిందని.. పంది కొవ్వు, గొడ్డు కొవ్వు కలిశాయని నిందలు వేసిన చంద్రబాబు.. దేవదేవుడి ప్రసాదం రూపంలో ఎలా దోచు కుంటున్నారో తేలాలి. కిలో రూ.320కి కొనా ల్సిన నెయ్యిని, హెరిటేజ్‌తో సంబం ధాలున్న ఇందాపూర్ డెయిరీ ద్వారా రూ.700కి సరఫరా చేస్తూ ఎలా దోచుకు తింటున్నారో తెలియాలి. ఈ అంశంపై మండలిలో చర్చ జరగాలి. జరిగిన మోసమేంటో ప్రజలకు తెలియాలి' అని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడారు. 'ఇందాపూర్ డెయిరీతో హెరిటేజ్ సంస్థ చీకటి ఒప్పందం కుదుర్చు కుంది. ఈ రెండు సంస్థలకు ఉన్న అనుబంధంపై ప్రశ్నిస్తే తితిదేతో వివరణ ఇప్పించారు. దానికి బదులు సభలోనే చర్చించొచ్చు కదా? ప్రభుత్వంలో ఉన్నవారు

ఇలాంటి తప్పులు చేస్తే.. అధి కారంలో కొనసాగే హక్కు ఉందా? కూటమి ప్రభుత్వానికి ఒక్క రోజూ అధికారంలో కొనసాగే హక్కు లేదు' అని బొత్స సత్యనారాయణ ధ్వజ మెత్తారు.

**రెడ్, ఎల్లో కాదు... బ్లూ బుక్:** 'మంత్రి లోకేశ్ మీద నాకు ప్రేమ, కోపం లేవు. ఆయన ఇప్పుడిప్పుడే రాజ కీయాల్లో ఎదుగుతున్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్, ఎల్లో బుక్ కాకుండా బ్లూ బుక్ రాజ్యాంగం నడిస్తే బాగుం టుంది' అని బొత్స సత్య నారాయణ అన్నారు. కాపులను బీసీల్లో చేర్చాలనే అంశంపై శాసనమండలిలో తొలుత ప్రశ్న వేసిన జనసేన ఎమ్మెల్సీ నాగబాబు.. తర్వాత ఎందుకు ఆ ప్రశ్నను ఉపసంహరిం చుకున్నారని ప్రశ్నించారు.

**వాళ్లు మా పార్టీలో లేరు**

వైకాపా నాయకులకు ఒక స్టాండ్ లేదా? మండలిలో వైకాపా రెండు రకాల తీర్మానాలు ప్రవేశపెట్టిందేమని ఒక విలేకరి అడిగిన ప్రశ్నపై బొత్స స్పందిస్తూ మర్రి రాజశేఖర్, బల్లి కల్యాణ చక్రవర్తి తమ పార్టీలో లేరని, తెదేపాలో చేరారని సెల్‌ఫోన్‌లో ఫొటో చూపించారు. వాళ్ల తీర్మానంతో తమకు సంబంధం లేదని స్పష్టం చేశారు. 'లడ్డూ విషయంలో చంద్రబాబు దేవుడ్ని, ప్రజలను మోసం చేశారు. తప్పులు వాళ్లు చేసి వైకాపాపై బురద జల్లారు. లడ్డూకు వాడే నెయ్యిపై వాయిదా తీర్మానం ఇస్తే చర్చించడానికి ఎందుకు భయ పడుతున్నారు?' అని వైకాపా ఎమ్మెల్సీలు వంకా రవీంద్రనాథ్, పర్వతరెడ్డి చంద్ర శేఖర్‌రెడ్డి, వరుదు కల్యాణి, కల్పలతారెడ్డి, తోట త్రిమూర్తులు ప్రశ్నించారు.

# బన్నుల వద్ద విద్వేషాలు సిగ్గుచేటు

### వలికి మద్దతుగా బన్‌లు తింటున్న నాయకులు



**తాడే ఫిబ్రవరి 19 (నేటి మనదేశమ్) :** అనేక సమస్యలతో ప్రజలు సతమతం అవుతున్నారని, వీటి పరిష్కారానికి కృషి జరగాల్సిన తరుణంలో పేదలు తినే రొట్టె దగ్గర కూడా మత విద్వేషాలు రెచ్చగొట్టే ఘటనలు సిగ్గుచేటని సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల మతవిద్వేష చర్యలకు గురైన కోవాబన్ విక్రేత వలికి మద్దతుగా ఉండవల్లి సెంటర్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి అధ్యక్షతన జరిగిన సభలో నేతాజీ మాట్లాడుతూ ఒక మతం వారిని లక్ష్యంగా చేసుకుని జరిగే దాడులు అధిక మయ్యాయని, ముఖ్యంగా బతుకు తెరువు కోసం పోరాటం చేస్తున్న పేదలపై మతోన్మాద కోణంలో దాడి హేయమని విమర్శించారు. మనిషిలోని మంచితనం, మానవతా ఇంకా మిగిలి ఉన్నా యని ఇటీవల జరిగిన ఘటనలపై స్పందిస్తున్న ప్రజలను చూసైనా మతోన్మా దమూకలు బుద్ధి తెచ్చుకోవాలని కోరారు. రొట్టెలు అమ్ము కుంటూ బతికేవలికి పౌర సమాజం మద్దతుగా నిలవడం, మంత్రి లోకేష్, జనసేన నాయకులు నాగబాబు అండగా నిల వడం స్వాగతిం చదగినదని చెప్పారు. ఉన్మా దాన్ని రెచ్చగొట్టే వారిని సమా జం నుండి వెలివేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు బి.వెంక టేశ్వర్లు, జె.నవీన్ ప్రకాష్, సిహెచ్.సుందర రావు, ఆర్‌వి.రాఘవయ్య, ఎస్‌కె.పీరుసాహెబ్, టి.బక్కిరెడ్డి, కె.రామకృష్ణ, వై.బర్నబాస్, కె.మేరీ, డివి.భాస్కర్‌రెడ్డి, డి.విజయ బాబు, బి.ప్రభాకర్, దుర్గారావు, బి.రామారావు పాల్గొన్నారు.

# 'ఆ రెండు' సీట్లు కాంగ్రెస్‌వే.. ఎవరికి దక్కేనో!!



**హైదరాబాద్,ఫిబ్రవరి 19 (నేటి మనదేశమ్) :** తాజాగా రాజ్యసభలో ఖాళీ అవుతున్న 37 స్థానాలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు రెడీ అయింది. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసింది. వీటిలో తెలంగాణకు చెందిన రెండు స్థానాలు ఉన్నాయి. బీఆర్ ఎస్‌కు చెందిన కేఆర్ సురేష్ రెడ్డి, కాంగ్రెస్‌కు చెందిన అభిషేక్ మను సింఘ్వీ పదవీకాలం ముగియనుంది.ఇక, అసెంబ్లీలో శాసన సభ్యుల సంఖ్య ఆధారంగా జరగనున్న ఈ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ ఎస్‌కు బలం తక్కువగా ఉన్నందున ఈ రెండు స్థానాలు కూడా అధికార పార్టీ కాంగ్రెస్‌కే దక్కనున్నాయి. అయితే వీటిలో ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఇప్పుడు కీలక చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం కేంద్ర స్థాయిలో బలమైన గళం వినిపించాల్సిన అవసరం ఉంది.ఈ నేపథ్యంలో మరోసారి అభిషేక్ మను సింఘ్వీకే అవకాశం దక్కే ఛాన్స్ కనిపిస్తోంది. పైగా ఈయన ప్రముఖ సుప్రీం కోర్టు న్యాయ వాది కూడా. దీంతో తరచుగా కాంగ్రెస్ తరఫున సుప్రీంకోర్టులో వాద నలు వినిపిస్తున్నారు. ఈ క్రమంలో ఆయనను మరోసారి ప్రోత్సహించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇదిలా వుంటే మరో సీటు అంశం ఇప్పుడు దోబూచులాడుతోంది.ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం ఈ సీటును సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈయన సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితులు. పైగా గత ఏడాది జరిగిన ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి తరఫున ఆయన పోటీ చేశారు. అయితే ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ విజయం సాధించారు.ఈ నేపథ్యంలో సుదర్శన్ రెడ్డికి రాజ్యసభ సీటు ఇచ్చే ఆలోచన ఉన్నట్టు సమాచారం. అప్పట్లోనే ఆయనకు పదవిపై హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌కు వచ్చిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అప్పట్లో, "సుదర్శన్ రెడ్డి గెలుస్తారా లేదా అనేది మాకు తెలుసు. ఆయనకు బలమైన మద్దతు ఉంటుంది," అని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో తాజాగా ఖాళీ అయిన సీటును ఆయనకు ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

# విశాఖ ఎంపీ రూ.5వేల కోట్ల భూమి కబ్జా

- పేదోడికి సెంటు భూమి ఇచ్చారా..?
- రెండేళ్లలో ఒక్కసారైనా భరత్ ఈ ప్రాంతానికి వచ్చారా?
- సామాజిక భవనం ప్రారంభోత్సవంలో జెడ్‌పి చైర్మన్



**జామి, ఫిబ్రవరి 19 (నేటి మనదేశమ్) :** రెండేళ్ల లో పేదోడికి సెంటు భూమి కూడా కూటమి ప్రభుత్వం ఇవ్వలేదు కానీ, విశాఖ ఎమ్‌పి భరత్ మాత్రం రూ.5 వేల కోట్లు విలువచేసే భూమిని దర్జాగా కబ్జా చేశారని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీని వాసరావు ఆరోపించారు. బుధవారం మండలంలోని కలగాడ పంచాయతీ మామిడిపల్లి గ్రామంలో రూ.30 లక్షల జిల్లా పరిషత్ నిధులతో నిర్మించిన సామాజిక భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు అన్నీ చేస్తామని మాయమాటలు చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలను పూర్తిగా విస్మరించిదని దుయ్య బట్టారు. ఎమ్‌పిగా గెలిచి రెండేళ్లు గడుస్తున్నా భరత్ మండలానికి ఒక్కసారైనా వచ్చారా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో రూ.3 లక్షల కోట్లు అప్పులు చేశామని విమర్శించిన కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే రూ.3 లక్షల కోట్లు అప్పులు చేసి, ఎవరికి ఖర్చు బెట్టిందో చెప్పాలని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వంలో రూ.3లక్షల కోట్లు అప్పులు చేస్తే, రూ. 2.70 లక్షల కోట్లు పేదల సంక్షేమానికే ఖర్చు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతిపక్షంలోనూ ప్రజల మధ్య తిరుగుతున్నామంటే, ప్రజల పక్షాన పని చేశాం కాబట్టే అని అన్నారు. గతంలో లగుడు సింహాద్రి కనుసన్నల్లో ఉండే గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదని, ప్రస్తుతం మండల వైసిపి నాయకత్వంలోను గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ పులిరాజు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె రవికుమార్, జెడ్‌పిటిసి సరయు, ఎంపిపి అరుణ, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 21న వినుకొండకు సీఎం చంద్రబాబు

### సమీక్షలో పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా



**పల్నాడు జిల్లా ఫిబ్రవరి 19 (నేటి మనదేశమ్) :** స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్య క్రమంలో పాల్గొనేందుకు సిఎం చంద్రబాబు ఈ నెల 21న వినుకొండకు రానున్న దృష్ట్యా ఏర్పాట్లపై అధికారులతో పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా నరసరావు పేటలోని కలెక్టరేట్‌లో బుధవారం సమీ క్షించారు. ఎన్ఎస్‌పి గ్రౌండ్‌లో ఏర్పాటు చేయనున్న ప్రజా వేదిక ప్రాంగణం లోనే ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయాలని, ప్రజలకు అసౌకర్యం కలగ కుండా అన్ని మౌలిక వసతులూ కల్పించాలని చెప్పారు. డిఆర్‌డిఎ ద్వారా రూ.100 కోట్లు, మెప్మా ద్వారా రూ.50 కోట్ల రుణాలను సిఎం చేతుల మీదుగా ఇప్పించాలని ఎల్‌డిఎం రాంప్రసాద్‌కు సూచించారు. రుణాల వితరణ, స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రపై జిల్లాలో చేపడుతున్న అభ్యుదయం కార్యక్రమం, పిఎం స్వానిధి, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల పంపిణీ, వినుకొండ హార్టికల్చర్ హబ్ చర్యలు, ప్రజల నుండి తడి-పొడి చెత్త సేకరణ విధానం, అమృత్ 2.0 పథకం, పిహెచ్‌సిలలో అందుతున్న సేవలపై స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు.

సమావేశంలో జిల్లా ఏరియా ఆసుపత్రుల కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రసూన, కాలుష్య నియంత్రణ రీజినల్ అధికారి నజీరా బేగం, ఆసుపత్రి సూపరింటెండెంట్ దయానిధి, ఎపిఎంఎస్ఐడిసి అధికారి హనుమంతరావు నాయక్, డిఆర్‌డిఎ పీడీ ఝాన్సీరాణి, మెప్మా సిఎంఎం పద్మజ, ఉద్యానవన శాఖాధికారి వెంకట్రావు పాల్గొన్నారు.

# తోటపల్లి, రామతీర్థ సాగర్‌పై నిర్లక్ష్యం



**విజయనగరం, ఫిబ్రవరి 19 (నేటి మనదేశమ్) :** జిల్లాలో వ్యవసాయరంగ అభివృద్ధికి కీలకమైన తోట పల్లి, రామతీర్థసాగర్‌పై ప్రభుత్వ నిర్లక్ష్యం మరోసారి బయట పడింది. సుజల స్రవంతి విషయ ంలోనూ అదే రకమైన తీరుతెన్నులు కనిపి స్తున్నాయి. ఇతర జలాశయాల విషయం లోనూ మరింత దారుణ మైన దుస్థితి ఎదురవుతోంది. ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లోని కేటాయింపులే ఇందుకు తార్కా ణంగా చెప్పుకోవచ్చు. 68వేల ఎకరాల ఎడమకాలువ ఆయుకట్టును స్థిరీకరిస్తూనే కుడికాలువ ద్వారా విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో 1,46,221 ఎకరాల ఆయుకట్టుకు సాగునీరు అందించే లక్ష్యంతో తోటపల్లి ప్రాజెక్టును దాదాపు 2003లో తలపెట్టారు. ఇప్పటి వరకు రూ.869.36కోట్లు ఖర్చు చేసినట్టు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2015లో తొలిసారిగా నీరు విడుదల చేశారు. మరోవైపు పనులు, పిల్లకాలువల నిర్మాణం, భూసేకరణ, పునరా వాసం ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రధాన కాలువ మెయింటెనెన్స్ సైతం పట్టించుకోకపోవ డంతో పూడికతో నిండి ఉంది. ఫలితంగా లక్ష్యంలో మూడో వంతు ఎకరాలకు కూడా సాగునీరు అందించలేని దుస్థితి దాపురించింది. ఈనేపథ్యంలో మిగులు పనులకు రూ.110.36కోట్లు, భూసేకరణకు రూ.3కోట్లు, పునరావాస కల్పనకు రూ.106.81 కోట్లు, ఇతర అవసరాలకు రూ.1.71కోట్లు చొప్పున మొత్తం రూ.221.88కోట్లు అవసరం కానున్నాయి. ఈమేరకు ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు కూడా ప్రభుత్వానికి పంపినట్టుగా సమాచారం. ప్రభుత్వం మాత్రం కేవలం రూ.47.81కోట్లు కేటాయించి చేతులు దులుపుకుంది. గత ఏడాది కూడా ఇదే స్థాయిలో నిధులు కేటాయించింది. ఆచరణలో ఖర్చుచేసింది కేవలం రూ.3.54కోట్లు మాత్రమే. వాస్తవానికి 20ఏళ్ళగా తగిన కేటా యింపులు లేకపోవడం వల్లే ఇప్పటికీ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో, బడ్జెట్ అంచనాలు కూడా ఏటా పెరిగిపోతున్నాయి. మరోవైపు నెల్లిమర్ల, భోగాపురం, డెంకాడ మండలాల్లో 24వేల ఎకరాల ఆయుకట్టుకు సాగునీరు అందించడంతోపాటు విజయనగరానికి తాగునీరు అందించే లక్ష్యంతో 20ఏళ్ల క్రితం చేపట్టిన రామ తీర్థసాగర్ పనులు కూడా ఇప్పటికీ అసం పూర్తిగా ఉన్నాయి. దీంతో, చుక్కనీరు అందించలేని పరిస్థితి. ఈ ప్రాజెక్టు పూర్తిచేసేందుకు కేవలం పనుల కోసమే రూ.127.20కోట్లు కేటాయిం చాల్సి వుంది. భూ సేకరణకు మరో రూ.32 కోట్లు, పునరా వాసానికి రూ.168.75 కోట్లు చొప్పున మొత్తంగా రూ.327.95 కోట్లు కేటాయిం చాల్సి వుంది. కానీ, గత ఏడాది మాదిరిగా కేవలం రూ.68కోట్ల కేటా యింపుతో ప్రభుత్వం సరిపెట్టింది. గత ఏడాది కేటాయింపులో ఖర్చుచేసింది రూ.4.55 కోట్లు మాత్రమే. సుమారు 17వేల కోట్ల వ్యయంతో 8లక్షల ఎకరా లకు సాగునీరు అందించే లక్ష్యంతో తల పెట్టిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి రూ.505కోట్ల 75లక్షల 10వేల కేటాయించింది. ఏటా ఇంత తక్కువ మొత్తంలో నిధులు కేటాయిస్తే అంచనా వ్యయం వందల రెట్లు పెరిగిపోయే అవకాశం లేక పోలేదు. మరోవైపు బడ్జెట్‌లో రైతుల సంక్షేమానికి తగినంతగా నిధులు కేటాయించలేదు. ఆంద్ర, పెద్దగెడ్డ, వట్టిగెడ్డ, పెద్దగెడ్డ జలాశయాలు, డెంకాడ ఆనకట్ట గురించి బడ్జెట్‌లో కనీస ప్రస్తావన లేకపోవడం గమనార్హం. జం ఝావతి, తాటిపూడి జలాశయాలకు పట్టుమని రూ.10వేలకు మించి కేటాయించడం ప్రభుత్వ వివక్షకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. వెంగళరాయ సాగర్ ఆయకట్టుకు సాగునీరు అందించే లక్ష్యంతో రూ.1కోటి మాత్రమే కేటాయించారు. పనులకు కేటాయించింది మాత్రం 2.38లక్షలే. ముడ్డువలస ప్రాజెక్టు కాలువల భూసేకరణకు రూ.66లక్షలు కేటాయించారు.

# రైతువద్ద రూ.70 వేల లంచం

నకరికల్లు : విద్యుత్ ట్రాన్స్‌ఫారం మంజూరు చేయడానికి రైతువద్ద లంచం తీసుకుంటూ అవినీతి నిరోదక శాఖ (ఏసీబీ)కి గ్రామ సచివాలయం ఎనర్జీ అసిస్టెంట్ రెడ్‌హ్యాన్‌డెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ అదనపు ఎస్పీ మహేంద్ర మాత్రే తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చేజర్ల గ్రామానికి చెందిన రైతు గుండాల యోహాను తన పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫారం కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. మంజూరు చేయాలంటే రూ.70 వేలు ఇవ్వాలని సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ నక్కబోయిన నాగేంద్రబాబు డిమాండ్ చేశాడు. దీంతో బాధిత రైతు వారం కిందట ఏసీబీని ఆశ్రయించారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం చేజర్ల సచివాలయం వద్ద ఏసీబీ అధికారులు మాటువేశారు. రైతు నుండి రూ.70 వేలను నక్కబోయిన నాగేంద్రబాబు తరుపున అతని తండ్రి శ్రీనివాసరావు తీసుకుంటుండగా అధికారులు దాడి చేసి తండ్రీకొడుకులిద్దర్నీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

## చిన్నారి సంరక్షణ, పోషణకు బాధ్యత వహించాలి జిల్లా కలెక్టర్



**మచిలీపట్నం ఫిబ్రవరి 19( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గురువారం కలెక్టరేట్లో ఛాంబర్ నందు దత్తత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ దత్తత కోసం దరఖాస్తు చేసుకున్న విశాఖపట్నం కి చెందిన గోపాల్ రఘు కుమార్, రాధిక మణి దంపతులకు కేంద్ర ప్రభుత్వ దత్తత అధీకృ త సంస్థ (కారా) అనుమతి లభించటంతో చిన్నా రిని దత్తత కు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. గన్నవరం మండలం బుద్ధవరం శిశుగృహాలో ఆశ్రయం పొందుతున్న చిన్నారి ని దత్తతు ఇచ్చారని తెలిపారు. అనంతరం దత్తతు తీసుకున్న దంపతులని అభినందించి ఇకపై చిన్నారి సంరక్షణ బాధ్యత పూర్తిగా వారిపై ఉందన్నారు. ఈ కార్యక్రమం లో ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, నోడల్ అధికారి భానుమతి, ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ ఆరంభం శుభాకాంక్షలు తెలిపిన ఏఐసీసీ మెంబర్



**మచిలీపట్నం ఫిబ్రవరి 19( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పవిత్ర రంజాన్ మాసం ఆరంభం సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు ఏఐసీసీ మెంబర్ సుంకర పద్మశ్రీ. దివ్య ఖురాన్ అవతరించిన ఈ పవిత్ర మాసంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు ఉపవాస దీక్షలు, ప్రతినిత్యం ప్రార్థనలు, పేదలకు దానధర్మాలు చేస్తూ, ఆధ్యాత్మిక చింతనతో నియమనిష్ఠలతో ముందుకు సాగేందుకు, వారి దీక్ష పవిత్రంగా సాగాలని ఆకాంక్షించారు పద్మశ్రీ.

## ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి...... ఎగ్జామ్ కన్వీనర్ సరళ కుమారి.

**మచిలీపట్నం ఫిబ్రవరి 19( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 23 నుంచి ప్రారంభమై మార్చి 24తో ముగియనున్నాయి. పరీక్షలు సజావుగా సాగేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని కమిషనర్ కార్యాలయానికి అనుసంధానం చేయనున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో పర్యవేక్షణ చేపడుతున్నారు. పరీక్షల అనంతరం సీసీ కెమెరా ఫుటేజీని భద్రపరిచి అధికారులకు అప్పగిస్తారు. కృష్ణా జిల్లా వ్యాప్తంగా మొత్తం 49,578 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 24.173 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 25,456 మంది ఉన్నారు. జిల్లాలో 14 జోన్లు, 63 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు అని అధికారులు తెలిపారు. 63 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 63 మంది డిపార్ట్మెంటల్ అధికారులు, సుమారు 1,100 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తించను న్నారు. అదనంగా 4 సిట్టింగ్ స్క్వాడ్లు, 3 ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించారు. ప్రశ్న పత్రాల భద్రపరిచేందుకు 18 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియెట్ పరీక్షల కన్వీనర్ ఎస్ సరళ కుమారి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు అరగంట ముందే చేరుకోవాలి అని అన్నారు. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకుంటే ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్ష రాసేందుకు వీలుంటుంది. ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటలు వరకు పరీక్ష ఉంటుంది. తొమ్మిది గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు అని అన్నారు. పరీక్షలను పారదర్శకంగా, ప్రశాంత వాతావర ణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం అని 144 సెక్షన్ అమలు పటిష్ట బందోబస్తు చేస్తున్నాం అని తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్ల కోసం మన మిత్ర వాట్సాప్ నంబర్ 9552300009ను సంప్రదించాలి కోరారు.

## భారత బీమా సంస్థ యందు ఆధునికరణ ప్రాంతీయ కార్యాలయం ప్రారంభోత్సవం



**మచిలీపట్నం ఫిబ్రవరి 19( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మచిలీపట్నం కెనడి రోడ్ లో ఉన్న భారతీయ జీవిత బీమా సంస్థ యందు ఆధునీకరణ ప్రాంతీయ కార్యాలయాన్ని బుధవారం జీవన ప్రకాశ బిల్డింగ్ నందు సౌత్ సెంట్రల్ జోన్ జోనల్ మేనేజర్ పునీత్ కుమార్, సౌత్ సెంట్రల్ జోన్ చీఫ్ ఇంజనీర్ ఎ హిలాలి ,సీనియర్ డివిజన్ మేనేజర్ జి సుధాకర్ బాబు లచే ప్రారంభోత్సవం జరిగింది. మొదట వేద పండితులచే పూజా కార్యక్రమం అనంతరం జ్యోతి ప్రజ్వల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏజెంట్లు అంకితభావంతో పనిచేసి వ్యాపారాన్ని వృద్ధి చేయాలని సందేశమిచ్చారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ వెంకటరమణ (మేనేజర్ ఓ ఎస్ ), కె డి వి కృష్ణ (పి అండ్ ఐ ఆర్ ), పి విఠల్ బాబు(మార్కెటింగ్ మేనేజర్ )మరియు బ్రాంచ్ ఉద్యోగులు ఏజెంట్లు డివిజనల్ ఆఫీసర్లు ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాంజలి 2.0 అవగాహన సదస్సు



**మచిలీపట్నం ఫిబ్రవరి 19( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నోబుల్ కళాశాల మచిలీపట్నం నందు జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో విద్యాంజలి 2.0 పై ఒకరోజు అవగాహన సదస్సు ను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు-2, మండలానికి ఒక క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు ఒక ఎస్ఎంసి ఛైర్మన్, ఎన్జీవోలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కృష్ణా జిల్లా కలెక్టర్ డి కె బాలాజీ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాంజలి 2.0 పాఠశాలల బలోపేతానికి మంచి కార్యక్రమము అని, వాలంటీరులుగా సర్వీసును ఎవరైనా ఇవ్వాలనుకుంటే విద్యాంజలి 2.0 వెబ్సైట్ నందు నమోదు చేసుకొవాలి అని సూచించారు. గ్యారెంటీ ఎఫ్ ఎల్ ఎన్ బలోపేతానికి ప్రధానోపాధ్యాయులు పాఠశాల పరిధిలోని విద్యావేత్తలను, పూర్వ విద్యార్థులను సమీకరించి, వారితో వెనుకబడిన విద్యార్థులకు అదనపు శిక్షణను ఇప్పించినట్లయితే వారు కూడా మిగిలిన విద్యార్థుల లాగా ఎఫ్ ఎల్ ఎన్ తేలికగా అధిగమిస్తారు అని తెలిపారు . ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖధికారి యు వి సుబ్బారావు మాట్లాడుతూ పాఠశాలల్లో ముఖ్య అవసరాలను మొదట ప్రధానోపాధ్యాయులు గుర్తించి వాటిని విద్యాంజలి 2.0 సైట్ నందు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి హాజరైన సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆర్ కుమిదినీ సింగ్ మాట్లాడుతూ మొదట జిల్లాలోని అన్ని పాఠశాలలు విద్యాంజలి 2.0 లో రిజిస్టర్ చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరల్ ఆఫీసర్స్ శ్యామ్ సుందర్, రమేష్ , రామకృష్ణ , నగేష్ ,పద్మజ పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు వేగవంతం చేయాలి



**ఒంటిమిట్ట ఫిబ్రవరి 19( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో మార్చి 27 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఏప్రిల్ 1న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణం ఏర్పాట్లను వేగవంతం చేయాలని తితిదే జేఈవో వి.వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు చేపట్టిన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు, భవిష్యత్లో చేపట్టాల్సిన పనులను పరిశీలించి, అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈవో అధికారులతో కలిసి శ్రీ కోదండరామస్వామి వారి ఆలయం ఎదుట తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వంటశాల, ముడి సరకులు నిల్వ ఉంచే షెడ్లను పరిశీలించారు. భక్తులకు అన్నప్రదాలు పంపిణీ చేసేందుకు వీలుగా టేబులు, కుర్చీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయంలో, యాగశాలలో మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాల న్నారు. తితిదే స్థానిక ఆలయాల్లో ఏ విధంగా అయితే శ్రీవారి సేవకుల సేవలు వినియోగించుకుంటున్నారో.. అదేవిధంగా ఒంటిమిట్ట కోదండరా మస్వామివారి ఆలయంలో వినియోగిం చుకోవాలని సూచించారు. ఆలయ ప్రాంగణం సమీపంలో ఫొటో ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాల వేదికను పరిశీలించారు. ఆయన వెంట సీఈ టి.వి.సత్యనారాయణ, ఎస్ఈలు మనోహర్, నరసింహమూర్తి, ఎస్ఈ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, సీపీఆర్ఓ డా.టి.రవి, సీఎంవో డా.కుసుమ కుమారి, ఆలయ డిప్యూటీ ఈవో ప్రశాంతి, అదనపు ఆరోగ్యశాఖ అధికారి డా.సునీల్, డీపీపీ ప్రత్యేక అధికారి రఘునాథ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శివరాత్రి బ్రహ్మోత్సవాలు.. గోవాడ శైవక్షేత్రం ఆదాయం రూ.54 లక్షలు



**అమృతలూరుఫిబ్రవరి 19( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం అమృ తలూరు మండలం గోవాడ శ్రీ బాలకోటేశ్వర స్వామివారి దేవస్థానం ఆదాయం రూ. 54 లక్షలు సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇక్కడి ఆలయంలో ఐదు రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ నేపథ్యంలోనే గురువారం హుండీ లెక్కింపు చేపట్టారు. అభిషేకం, దర్శనం టిక్కెట్ల అమ్మకం, ఖాళీ స్థలాల వేలంపాట, కొబ్బరికాయల అమ్మకం, కొబ్బరి చిప్పల సేకరణ, హుండీ తదితరాల ద్వార రూ. 54,04,785 ఆదాయం వచ్చిందని ఆలయ ఏవో విఠల్ శ్రీనివాస వర్మ తెలిపారు.

## అహోబిలంలో ముగిసిన పార్వేట ఉత్సవం



**ఆళ్లగడ్డ గ్రామీణం ఫిబ్రవరి 19( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట పల్లకి గురువారం అహోబిలం చేరుకుంది. రుద్రవరం నుంచి దిగువ అహోబిలానికి స్వామి పల్లకి చేరుకోగానే ఆలయ అర్చకులు, గ్రామస్థులు ఊరేగింపుగా వెళ్లి స్వామికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పీఠాధిపతి రంగనాథ యతేంద్ర మహాదేశికన్ స్వామిని ప్రత్యేకంగా ఆరాధించారు. అనంతరం ఆలయంలో ప్రహ్లాద వరద స్వామి, జ్వాలా నరసింహ స్వామిని కొలువు తీర్చి నవ కలశాలతో అభిషేకం చేశారు. 32 రోజులపాటు స్వామి పార్వేటలో భాగంగా ఊరూరా తిరిగి రావడంతో సేద తీర్చేందుకు అభిషేక, కైంకర్యాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్ తెలిపారు. ఈ ఘట్టంతో అహోబిలేశుడి పార్వేట ఉత్సవం ముగిసింది.

## మంగళగిరి శ్రీలక్ష్మీ నరసింహాస్వామి బ్రహ్మోత్సవాలు.. -మంత్రి లోకేశ్‌కు ఆహ్వానం



**ఉండవల్లి ఫిబ్రవరి 19( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మంగళగిరిలో ఫిబ్రవరి 22వ తేదీ నుంచి మార్చి 5వ తేదీ వరకు శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహించను న్నారు. ఈ ఉత్సవాలకు హాజరుకా వాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆలయ ఈవో, ట్రస్ట్ బోర్డు సభ్యులు మంత్రి లోకేశ్‌ను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ నెల 22న శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలను ప్రారంభించాలని మంత్రిని కోరారు. ప్రమాణస్వీకారం తర్వాత ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు మొదటిసారి మంత్రిని కలిశారు. అనంతరం మంత్రిని ఘనంగా సన్మానించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో కోగంటి సునీల్ కుమార్‌తోపాటు ట్రస్ట్ బోర్డు సభ్యులు ఉన్నారు.

## సఖి వన్ స్టాప్ భవన నిర్మాణానికి శంకుస్థాపన



**మచిలీపట్నం ఫిబ్రవరి 19( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కృష్ణా జిల్లా మచిలీపట్నం లోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు మహిళ, శిశు క్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎమ్ ఎన్ రాణి , ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ ఈ.ఈ ఎస్ లోకేశ్వర్ రావు , డి.ఈ సంగీత చే సఖి- వన్ స్టాప్ సెంటర్ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ పి.సురేష్ కుమార్ , నోడల్ ఆఫీసర్ సుధా రాణి , సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ అచ్చిష్మ, భవన నిర్మాణ కాంట్రాక్టర్ నిరంజన్ రావు , వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంధత్వాన్ని జయించి గ్రూప్ 2 విజయం.



**మచిలీపట్నం ఫిబ్రవరి 19( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అంధత్వాన్ని జయించి గ్రూప్ - 2 పరీక్షల్లో విజేతగా నిలిచి ఏపీపీఎస్సీ హెచ్ ఓ డి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా ఉద్యోగం సాధించిన చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు సాలిపేటకు చెందిన నందం నాగరాజును కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీ బుధవారం సన్మానించారు. గ్రూప్ 2 విజేతగా నిలిచి ఉద్యోగం సాధించటం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ నాగరాజును అభినందించారు. కంటిచూపు కోల్పోయిన నాగరాజు విద్యాభ్యాసం ఎలా సాగించారో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, నాగరాజు తల్లి వెంటేశ్వరమ్మ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పర్యాటక కేంద్రంగా బాపట్ల తీర ప్రాంత అభివృద్ధి



**బాపట్ల ఫిబ్రవరి 19( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** తీర ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా గోవా పర్యటనలో ఉన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ బృందం గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా తీర పర్యాటక అభివృద్ధి, బీచ్ నిర్వహణ, భద్రతా చర్యలు, పర్యావరణ పరిరక్షణ అంశాలపై సవివరంగా చర్చించారు. బాపట్ల తీరాన్ని సమగ్ర పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి గోవా నమూనాలను అనుసరించాలనే సంకల్పాన్ని కలెక్టర్.. ఆయనకు వివరించారు .

## పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈవో



**కావలి ఫిబ్రవరి 19( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మండలంలోని మార్కండేయపురం పాఠశాలను గురువారం మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) బి. గోవిందయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను, అసెస్మెంట్ బుక్స్, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు, జీఎఫ్ఎల్ఎన్ తదితరాలను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయులకు విలువైన సలహాలు, సూచనలను అందించారు. నిరుపేద విద్యార్థుల ప్రయోజనార్థం పాఠశాలకు ప్రహరీ, శిథిలావస్థలో ఉన్న పాత భవనం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించేందుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేయాలని పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ కె. స్వాతి శ్రీనివాసులు ఎంఈవోను కోరారు. అనంతరం శ్రీరాంపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. శ్రీరాంపురం పాఠశాల సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేసి పాఠశాలలో రోల్ పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

## 249 మంది విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ




**కలసపాడుఫిబ్రవరి 19( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మండలంలోని కస్తూర్భాగాంధీ బాలికల విద్యాలయంలోని 249 మంది విద్యార్థినులకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. పోరుమామిళ్లకు చెందిన శాంతి ప్రేమ సేవా సమాజం ట్రస్ట్ ఆధ్వర్యంలో, ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ సహకారంతో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, చిత్తా తోమాస్ రెడ్డి దంపతులు వీటిని అందజేశారు. విద్యార్థినులు విలువలతో కూడిన విద్యనభ్యసించాలని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. సంస్థ కార్యదర్శి చిత్తా రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.) and
Printed at SKYLINE PRESS, D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.), Associate Editor : K. Neeraja, Ph: 0866-2411299. E-mail: netimanadesam.vja@gmail.com